RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 152 | జూలై 03 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 152 | July 03 Fryday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


మాజీ మంత్రి హరీశ్‌రావు అరెస్ట్ 2

## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

### తొలి బృందానికి చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
హిమాలయాల్లో వెలిసిన పవిత్ర అమర్‌నాథ్ హిమలింగ దర్శన వార్షిక యాత్ర ఘనంగా ప్రారంభమైంది. క్షేత్ర దర్శనార్థం బాల్తాల్ మార్గంలో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద రాంబన్ జిల్లా యంత్రాంగం, సివిల్ సొసైటీ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆత్మీయ ఆతిథ్యంతో ఘన స్వాగతం పలికారు. అంతకుముందు, జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ పవిత్ర యాత్ర కాన్వారును జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. చందర్‌కోట్ వద్ద భక్తులను సాదరంగా ఆహ్వానించిన వారిలో డీఐజీ సర్గున్

# ఏపీ నుంచి అమల్లోకి కేంద్ర ప్రతిష్టాత్మక పథకం

**'వీబీ జీ రామ్ జీ': దేశవ్యాప్తంగా చారిత్రక ప్రారంభం.. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక మరియు సరికొత్త విప్లవాత్మక పథకం 'వికసిత్ భారత్**

**కర్నూల్ జనసంఘర్షణ**
గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' (వీబీ జీ రామ్ జీ) ఆంధ్రప్రదేశ్ నుంచి దేశవ్యాప్తంగా అధికారికంగా అమల్లోకి వచ్చింది. తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ముక్కపల్లి గ్రామం ఈ చారిత్రక ఘట్టానికి వేదికైంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముక్కపల్లిలో రూ.4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం వంటి తొలి మూడు పనులను నేతలు ప్రారంభించి, స్థానిక లబ్ధిదారులకు జాబ్ కార్డులను పంపిణీ చేశారు. అలాగే, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్‌లు ఈ పథకం యొక్క ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించగా, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమాచార బుక్‌లెట్‌ను విడుదల చేశారు. నేతలు అంతా కలిసి 'వీబీ జీ రామ్ జీ' అధికారిక పోర్టల్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఏకంగా రూ.7.5 లక్షల కోట్ల భారీ నిధులను వెచ్చించనుంది. దీని ద్వారా ప్రతి గ్రామ



పంచాయితీకి ఏడాదికి సగటున రూ.2 కోట్ల వరకు నిధులు అందుతాయి. ఇందులో భాగంగా ఈ 9 నెలల కాలానికి గానూ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు విడుదల కానున్నాయి. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.4 వేల కోట్లు చేర్చి, మొత్తం రూ.11 వేల కోట్ల పైచిలుకు నిధులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

## మూసీ సుందరీకరణ, భారీ పోస్టుల భర్తీ

### ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం , తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్ జనసంఘర్షణ**
ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం పలు సంచలన, చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా ఫేజ్-ఎ పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. హిమాయత్ సాగర్ నుంచి ఈసా ప్రవాహం, ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహం ప్రారంభమయ్యే ప్రాంతాల నుండి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవునా చేపట్టే




తొలి దశ అభివృద్ధి పనుల కోసం రూ. 7,345.12 కోట్ల భారీ

➤ మిగతా 2వ పేజీలో..

## వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్రం ఆందోళనలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
వాట్సాప్‌లో త్వరలో ప్రవేశపెట్టబోతున్న 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన భద్రతాపరమైన అభ్యంతరాల నేపథ్యంలో మెటా సంస్థ కీలక వివరణ ఇచ్చింది. ఈ కొత్త ఫీచర్ వల్ల డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆర్థిక నేరాలు మరియు నకిలీ గుర్తింపులతో కూడిన మోసాలు పెరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు, ప్రముఖులు, ఆర్థిక సంస్థల పేర్లను పోలిన యూజర్‌నేమ్‌లను సృష్టించి దుర్వినియోగానికి పాల్పడే ప్రమాదం ఉందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు ఈ ఫీచర్‌ను అమలు చేయొద్దని ఆదేశించడంతో పాటు, దీని భద్రతా చర్యలపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని వాట్సాప్‌కు నోటీసులు జారీ చేసింది. దీనిపై స్పందించిన వాట్సాప్ ప్రతినిధి ప్రస్తుతం ఈ ఫీచర్‌ను పూర్తిగా




అందుబాటులోకి తీసుకురాలేదని స్పష్టం చేశారు. వినియోగదారులు తమకు నచ్చిన యూజర్‌నేమ్‌ను ముందస్తుగా రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని, యూజర్‌నేమ్ ఆధారంగా సందేశాలు పంపే సేవలను ఈ ఏడాది చివర్లో దశలవారీగా అమలు చేస్తామని

➤ మిగతా 2వ పేజీలో..

## జన్మతః పిల్లల పౌరసత్వం కేసు: అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఎన్నారైలకు భారీ ఊరట

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
అమెరికాలో జన్మించే విదేశీ వలసదారుల పిల్లల పౌరసత్వాన్ని పరిరక్షిస్తూ ఆదేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) వెలువరించిన చారిత్రాత్మక తీర్పుపై భారతీయ అమెరికన్లు (ఎన్నారైలు) హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమ వలసదారులు, హెచ్-1బి వంటి తాత్కాలిక

➤ మిగతా 2వ పేజీలో..



## రష్యాకు ఎగుమతులపై ఆంక్షలు

### నాలుగు భారతీయ కంపెనీలపై అమెరికా నిషేధం ఎత్తివేత

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
రష్యాకు రక్షణ రంగ సాంకేతికత, అత్యాధునిక యంత్ర పరికరాలను సరఫరా చేస్తున్నాయన్న ఆరోపణలతో గతంలో నాలుగు భారతీయ కంపెనీలపై విధించిన ఆంక్షలను అమెరికా ప్రభుత్వం తాజాగా తొలగించింది. అమెరికా ఆర్థిక శాఖకు చెందిన 'ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్' (ఓఎఫ్ఏసీ) తన 'ప్రత్యేకంగా నిర్దేశించిన పౌరులు మరియు బ్లాక్ చేయబడిన వ్యక్తుల' (ఎస్‌డీఎన్) జాబితా నుండి ఈ కంపెనీల పేర్లను తొలగిస్తూ అధికారిక నిర్ణయం తీసుకుంది. ఈ ఆంక్షల సడలింపు పొందిన వాటిలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీలైన 'ఆర్ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్', మరియు

➤ మిగతా 2వ పేజీలో..

# మూసీ సుందరీకరణ, భారీ పోస్టుల భర్తీ

**మొదటిపేజీ తరువాయి..** కేటాయింపునకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు నిర్వహణ, పనుల పర్యవేక్షణ కోసం నూతనంగా 147 పోస్టుల సృష్టికి, అలాగే ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకునేందుకు అంగీకారం తెలిపింది. మరో చారిత్రాత్మక నిర్ణయంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనాన్ని ఇకపై వారితో పాటు పనిచేసే ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర పాఠశాల సిబ్బందికి కూడా ఉచితంగా అందించాలని కేబినెట్ నిర్ణయించింది. వివిధ ఉపాధ్యాయ సంఘాల నుంచి అందిన విజ్ఞప్తులను పరిశీలించి తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది. విద్యార్థులతో పాటు ఒకే పంక్తిలో ఉపాధ్యాయులు కూడా భోజనం చేయడం వల్ల పాఠశాలల్లో సమానత్వం పెంపొందడమే కాకుండా, భోజనం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి వీలవుతుందని మరియు దీనివల్ల సిబ్బంది ఒత్తిడి లేకుండా నాణ్యమైన విద్యను అందించగలరని ప్రభుత్వం అభిప్రాయపడింది.

వైద్యారోగ్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా కొత్తగా అందుబాటులోకి వస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 6,278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సనత్ నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఈ పోస్టులను కేటాయించగా, ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అత్యున్నతంగా అభివృద్ధి చేయాలని, ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాగా, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా తీసుకొచ్చిన 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై తెలంగాణ మంత్రివర్గం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా పాత ఉపాధి హామీ పథకాన్ని మార్చడం దుర్మార్గమని, దీనివల్ల రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని మంత్రులు మండిపడ్డారు. ఉపాధి హామీలో మార్పులు చేయవద్దని గత జనవరిలోనే అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో గత్యంతరం లేని పరిస్థితిలో జూలై 1 నుంచి ఈ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు నోటిఫికేషన్‌కు ఆమోదం తెలుపుతూనే, కేంద్ర నిబంధనలపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయాలని, పార్లమెంట్‌లోనూ నిలదీయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

రాష్ట్రంలో మౌలిక వసతులు, విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పలుచోట్ల ప్రభుత్వ భూములను కేటాయిస్తూ కేబినెట్ తీర్మానించింది. నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ రేటు ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో 50 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు కోసం మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. వీటితో పాటు జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామంలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు మరో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం కీలక

# వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్రం ఆందోళనలు

**మొదటిపేజీ తరువాయి..** వెల్లడించారు. ఈ ఫీచర్ వచ్చినప్పటికీ వాట్సాప్‌ను ఉపయోగించడానికి మొబైల్ నంబర్ తప్పనిసరిగా కొనసాగుతుందని, అయితే కొత్త వ్యక్తులు లేదా గ్రూపులతో కనెక్ట్ అయ్యేటప్పుడు మొబైల్ నంబర్ వెల్లడించకూడదనుకునే వారి కోసం మాత్రమే ఇది ఐచ్ఛికంగా (ఆప్షనల్) అందుబాటులో ఉంటుందని తెలిపారు. నకిలీ ఖాతాల నివారణకు సంబంధించి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో ఇప్పటికే ఉన్న సెలబ్రిటీలు, ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు మరియు మెటా వెరిఫైడ్ ఖాతాల యూజర్‌నేమ్‌లను వారి అసలు యజమానుల కోసమే రిజర్వ్ చేస్తున్నట్లు వాట్సాప్ పేర్కొంది. ఇందుకోసం వినియోగదారులు తమ సోషల్ మీడియా ఖాతాలను లింక్ చేసి యాజమాన్యాన్ని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది, ఆ తర్వాత కావాలంటే వాటిని అన్‌లింక్ చేసుకోవచ్చు. ఒకవేళ సాధారణ పేర్లు ఇప్పటికే ఇతరులు తీసుకుంటే, ప్రత్యామ్నాయ పేర్లను సూచించే జనరేటర్‌ను ఉపయోగించుకోవచ్చు.

యూజర్‌నేమ్‌ల ఆధారంగా మోసాలు జరగకుండా ఉండేందుకు వాట్సాప్‌లో వీటిని నేరుగా సెర్చ్ చేసే సదుపాయం ఉండదని స్పష్టం చేసింది. దీనికి తోడు 'యూజర్‌నేమ్ కీ' అనే అదనపు భద్రతా వ్యవస్థను కూడా ప్రవేశపెడుతోంది. దీన్ని యాక్టివేట్ చేసుకుంటే అవతలి వ్యక్తికి యూజర్‌నేమ్‌తో పాటు ఈ 'కీ' కూడా తెలిసి ఉంటేనే మెసేజ్ చేయడం సాధ్యమవుతుంది, ఈ కీని వినియోగదారులు ఎప్పుడైనా మార్చుకోవచ్చు. ఒకవేళ కొత్త వ్యక్తి నుంచి మెసేజ్ వస్తే సదరు అకౌంట్ యొక్క దేశం, ఖాతా వివరాలు మరియు భద్రతా హెచ్చరికలను స్క్రీన్‌పై చూపిస్తామని, ఇప్పటికే ఉన్న బ్లాక్, రిపోర్ట్ వంటి రక్షణ చర్యలు యథావిధిగా కొనసాగుతాయని వాట్సాప్ వివరించింది.

# జన్మతః పిల్లల పౌరసత్వం కేసు: అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఎన్నారైలకు భారీ ఊరట

**మొదటిపేజీ తరువాయి..** వీసాలపై ఉన్నవారి పిల్లలు అమెరికా గడ్డపై జన్మిస్తే వారికి జన్మతః వచ్చే అమెరికా పౌరసత్వాన్ని నిరాకరించాలని కోరుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాఖలు చేసిన పిటిషన్‌ను లేదా జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే.. వారిని చట్టబద్ధంగా అమెరికన్లుగానే పరిగణించాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు అమెరికాలోని లక్షలాది వలస కుటుంబాలకు గొప్ప భరోసా కల్పించిందని ఇండో-అమెరికన్ సంఘాలు పేర్కొంటున్నాయి. ట్రంప్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ ప్రతిపాదనల వల్ల ప్రత్యక్షంగా నష్టపోయేది భారత్, మరియు దక్షిణాసియా దేశాల వలస కుటుంబాలేనని వారు గుర్తుచేశారు. ఈ నిర్ణయాన్ని ఒక 'చరిత్రాత్మక విజయం'గా పలువురు ఎన్నారై ప్రముఖులు అభివర్ణించారు.

అమెరికాలో ప్రస్తుతం నివసిస్తున్న దాదాపు 52 లక్షల మంది ఇండో-అమెరికన్లలో.. 12 లక్షల మందికి పైగా ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డుల కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్నారని ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ (ఖీ××ఖూ) అధ్యక్షుడు ఖండేరావ్ కంద్ తెలిపారు. అలాగే, ప్రస్తుతం అమెరికాలో 6 నుంచి 7 లక్షల మంది హెచ్-1బి వీసాదారులు ఉండగా, వారిలో 70 శాతానికి పైగా భారతీయులే ఉన్నారని తాజా అంచనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పుతో అమెరికాలో స్థిరపడిన, స్థిరపడాలనుకుంటున్న లక్షలాది మంది భారతీయ ఐటీ నిపుణులు, హెచ్-1బి వీసాదారులకు వారి పిల్లల భవిష్యత్తు పరంగా చాలా పెద్ద ఊరట లభించినట్లయింది.

# రష్యాకు ఎగుమతులపై ఆంక్షలు

**మొదటిపేజీ తరువాయి..** 'లోకేష్ మెషిన్స్ లిమిటెడ్' ఉన్నాయి. వీటితో పాటు అహ్మదాబాద్‌కు చెందిన 'గేలక్సీ బేరింగ్స్ లిమిటెడ్', న్యూఢిల్లీకి చెందిన 'శౌర్య ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థలపై కూడా అమెరికా నిషేధాన్ని ఎత్తివేసింది. గతంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో, రష్యా సైనిక-పారిశ్రామిక రంగానికి పరోక్షంగా మద్దతు ఇస్తున్నాయనే నెపంతో 2024లో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14024 కింద అమెరికా ఈ చర్యలు చేపట్టింది. యుద్ధ పరికరాల తయారీలో ఉపయోగించే మైక్రోఎలక్ట్రానిక్స్ పరికరాలను రష్యాకు చెందిన 'ఆర్టెంక్స్' కంపెనీకి వందకు పైగా షిప్‌మెంట్ల ద్వారా సరఫరా చేసిందని ఆర్‌ఆర్‌జీ ఇంజనీరింగ్ సంస్థపై, అలాగే రక్షణ రంగానికి అవసరమైన అధునాతన యంత్రాలను (మెషిన్ టూల్స్) విక్రయించిందని లోకేష్ మెషిన్స్ సంస్థపై గతంలో ఆంక్షలు విధించారు. ఆయుధాల తయారీలో వాడే రోలర్ బేరింగ్స్‌ను రష్యాకు ఎగుమతి చేసిందని గేలక్సీ బేరింగ్స్ సంస్థపై, రాడార్, రేడియో నావిగేషన్, రిమోట్ కంట్రోల్ వంటి ఎలక్ట్రికల్ పరికరాలను విక్రయించిందని శౌర్య ఏరోనాటిక్స్‌పై ఈ నిషేధం విధించారు. దాదాపు రెండేళ్ల తర్వాత అమెరికా ఈ ఆంక్షలను తొలగించడంతో ఈ నాలుగు కంపెనీల ఆస్తులపై ఉన్న ఫ్రీజ్ పూర్తిగా తొలగిపోవడమే కాకుండా, అంతర్జాతీయంగా అమెరికా అనుబంధ ఆర్థిక సంస్థలతో యథావిధిగా వ్యాపార లావాదేవీలు నిర్వహించుకునేందుకు ఈ కంపెనీలకు భారీ ఊరట లభించింది.

# అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి.** శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ట్రాఫిక్ ఎస్ఎస్పీ రాజా ఆదిల్ హమీద్ సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. భక్తులు బస చేసే మొదటి ప్రధాన కేంద్రమైన చందర్‌కోట్‌లోని లంగర్ సైట్ వద్ద యాత్రికులకు అవసరమైన వసతులు, భోజన సదుపాయాలను జిల్లా యంత్రాంగం ముందస్తుగానే సిద్ధం చేసింది. ఈ పవిత్ర యాత్ర సాఫీగా, సురక్షితంగా సాగేందుకు పోలీస్, ఆర్మీ, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (జూూాఖీ), ట్రాఫిక్ పోలీస్, ఆరోగ్య శాఖ, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక మరియు అత్యవసర సేవల విభాగాలు అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టాయి. భక్తుల భద్రత, సౌకర్యార్థం అన్ని ప్రభుత్వ విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నాయి.

# ఏపీ నుంచి అమల్లోకి కేంద్ర ప్రతిష్టాత్మక పథకం

**మొదటిపేజీ తరువాయి.** సారథ్యంలో ఏపీలోని గ్రామాల రూపురేఖలను మార్చనున్నారు. ఈ పథకం కింద 125 రోజుల పనిదినాలను కల్పిస్తూ.. రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు, మరియు పొలాలకు వెళ్లే డొంక రోడ్ల వంటి శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తారు. సాంకేతికత పరంగా జియో ట్యాగింగ్, బయోమెట్రిక్ విధానాలను ఉపయోగించి పూర్తి పారదర్శకతను పాటిస్తారు. ఈ పథకం రాష్ట్రాలకు భారం కాదని, గ్రామీణ ప్రగతికి ఒక బాధ్యతని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

మరోవైపు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. తనను మధ్యప్రదేశ్‌లో 'మామాజీ' అని పిలుస్తారని, ఇప్పుడు ఏపీకి కూడా తాను 'మేనమామ' అయ్యానని ఆత్మీయంగా వ్యాఖ్యానించారు. ఏ మేనమామ ఖాళీ చేతులతో రాడని చెబుతూ.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) కింద రాష్ట్రానికి 74,212 పక్కా ఇళ్లను, అలాగే గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్ల నిధుల పత్రాలను సీఎం, డిప్యూటీ సీఎంలకు అందజేశారు. అదేవిధంగా, రాయలసీమ ప్రాంత తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు 'మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్' కింద కేంద్ర ప్రభుత్వమే నేరుగా 2,16,250 మెట్రిక్ టన్నుల మామిడిని కొనుగోలు చేస్తుందని హామీ ఇస్తూ దానికి సంబంధించిన పత్రాలను కూడా అందజేశారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ సహా 93 కేంద్ర పథకాలను నిర్వీర్యం చేస్తే, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే వాటిని పునరుద్ధరించి రూ.28 వేల కోట్లతో పనులు చేపడుతోందని వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణం వేగంగా జరుగుతోందని, పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టుకోవడంతో పాటు రైల్వే జోన్ సాధించామని, గూగుల్ డేటా సెంటర్ మరియు పుట్టపర్తిలో ఫైటర్ జెట్ తయారీ యూనిట్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు వస్తున్నాయని తెలిపారు. రాయలసీమను ఉద్యానవన హబ్‌గా మార్చేందుకు త్వరలోనే మదనపల్లిలో హార్టీకల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. 'భారత మాతకు వికసిత్ భారత్ – తెలుగు తల్లికి స్వర్ణాంధ్ర' అనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం అన్‌స్టాపబుల్‌గా ముందుకు సాగుతుందని సీఎం స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సవాళ్ల పర్వం.. తెలంగాణ భవన్ వద్ద హరీష్ రావు అరెస్ట్

హైదరామాద్ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ రెండున్నరేళ్ల పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను లెక్కలతో సహా నిరూపించేందుకు వరంగల్ ప్రెస్ క్లబ్, అశోక్ నగర్ లేదా అసెంబ్లీ.. వేదిక ఏదైనా చర్చకు సిద్ధమంటూ బహిరంగ సవాల్ విసిరారు. ఒకవేళ తాను ఆధారాలతో నిరూపించలేకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు. ఈ సవాల్‌పై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, తాను గురువారం ఉదయం 11 గంటలకు చర్చ కోసం తెలంగాణ భవన్‌కు వస్తున్నట్లు ప్రతిసవాల్ విసిరారు. బీఆర్ఎస్ కూడా దీనిని స్వీకరించి, మంత్రి కోసం తెలంగాణ భవన్‌లో ప్రత్యేకంగా కుర్చీ సిద్ధం చేసి ఉంచామని తెలిపింది. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల కార్యకర్తలు భారీగా తరలిరావడంతో అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, మంత్రి జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని, తానే సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు గురుకులాల టెండర్లలో జరిగినట్లు చెప్తున్న అవినీతి ఆరోపణలపై చర్చ మరో మలుపు తిరిగింది. బీఆర్ఎస్ నేతలు దీనిపై సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో చర్చకు రావాలని కోరగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌లు గన్‌పార్క్‌కు రావాలని సవాల్ విసిరారు. మంత్రుల పిలుపును స్వీకరించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గన్‌పార్క్‌కు బయలుదేరారు. చర్చకు తాము సిద్ధమేనని, డ్రగ్స్ సరఫరా చేసే వారికి టెండర్లు ఇచ్చారనే అంశంపై ఎలాంటి భేషజాలు లేకుండా కూర్చొని మాట్లాడుకుందామని హరీష్ రావు స్పష్టం చేశారు. అయితే, గన్‌పార్క్‌కు

# మెదక్ జిల్లా చరిత్రలో రికార్డు స్థాయి ధాన్యం కొనుగోలు

- **జిల్లాలో జొన్నలు కొనుగోలు చేస్తాం.**
- **ధాన్యం కొనుగోళ్లలో మీడియా పాత్ర అమోఘం మీడియా సూచనలు, సలహాలు పాటించాం.**
- **జిల్లాలో సంపూర్ణంగా ధాన్యం కొనుగోళ్లు.**
- **ఈ ఏడాది యాసంగిలో గతంలో కంటే లక్ష మెట్రిక్ టన్నులు అత్యధికంగా రైతులు దిగుబడులు**
- **జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ**
- **రైతుల అకౌంట్లలో రూ 1005.66 కోట్ల రూపాయలు జమ**
- **101,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 2 (జన సంఘర్షణ)

జిల్లాలో సంపూర్ణంగా వరి ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలు విజయవంతం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా చరిత్రలో జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సంపూర్ణంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు. ఈ ఏడాది యాసంగిలో గతంలో కంటే 1.08 లక్షల మెట్రిక్ టన్నులు అత్యధికంగా రైతులు దిగుబడులు పండించారని, జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ పూర్తి అయిందన్నారు. రైతుల అకౌంట్లలో రూ.1005.66 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. 1,01,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ చేసి ఏప్రిల్ 08 న ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లుజూన్ 27వ తేదికి పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 533 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ -305, ఐకేపీ-185, డీసీఎంఎస్- 43 కేంద్రాల్లో కొనుగోలు జరిపామన్నారు.

**జొన్నలు కొనుగోలు చేస్తాం.**

జిల్లాలో జొన్న రైతులు ఎలాంటి ఆందోళన గురి కావద్దని, జొన్నల కొనుగోళ్ల గురించి సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. శుభ్రంగా ఉన్న జొన్నల్ని కొరడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 3609 ముందు రైతుల నుండి 6347 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానందశీ, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్ ,జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, పాత్రికేయులు పాల్గొన్నారు.



# మాన్సూన్‌పై ముందస్తు పటిష్ట కార్యచరణ రూపొందించాలి

- **అంటు వ్యాధులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి.**
- **మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజారోగ్య పరిరక్షణ మనందరి కర్తవ్యం.**
- **వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం.**
- **జిల్లాలో శానిటేషన్ ఆక్టివిటీ పగడ్బందీగా అమలు కావాలి.**
- **దోమలు పుట్టకుండా,కుట్ట కుండా లార్వాలను నిర్మూలించాలి.**
- **హైరిస్క్ గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసే దిశగా ముందస్తు ప్రణాళిక.**
- **ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రాణరక్షక మందులన్నింటినీ అందుబాటులో ఉంచాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 2 (జన సంఘర్షణ)

మాన్సూన్ ముందస్తు పటిష్ట కార్యచరణ రూపొందించాలని, అంటు వ్యాధులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజారోగ్య పరిరక్షణ మనందరి కర్తవ్యం. వైద్య ఆరోగ్య, పంచాయతీ శాఖ అధికారుల సమన్వయంతోనే సాధ్యపడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రజావాణి హాలు నందు వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పంచాయతీ ,అధికారులతో పరిసరాల పరిశుభ్రత వ్యాధుల నిర్మూలనే. ధ్యేయంగా సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి






ముందస్తు చర్యలు చేపట్టాలని వాతావరణం మారినప్పుడల్లా ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తాయి కాబట్టి వైద్య ఆరోగ్యశాఖతో పాటు లైన్ డిపార్ట్మెంట్స్ అలెర్ట్‌గా వుండాలని అన్నారు. ఈ నాలుగు నెలలు మెడికల్ క్యాంప్స్ నిర్వహించాలని, ఫీవర్ సర్వే చేపట్టాలని, సూచించారు. డెంగ్యూ పట్ల ప్రజల్లో ఉన్న భయాలను దూరం చేయాలని, నిరంతరం ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. మురికి కాల్వలు లేకుండా చూడాలని, దోమలు పుట్టకుండా కుట్టకుండా చూడాలని, డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ముఖ్యంగా శానిటేషన్ డ్రైవ్ పర్ఫెక్ట్‌గా చేయాలని, ప్రజలకు వ్యాధులు రాకుండా కాపాడాలని, వ్యాధులు వస్తే నిర్ధారణ పరీక్షలు నిర్వహించి తక్షణమే చికిత్స అందించాలని , తెలిపారు. డాక్టర్లు ప్రజలకు అందుబాటులో వుండాలని, ఆహారం, శుభ్రమైన మంచినీరు వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన, నివారణ చికిత్సలను ఆలస్యం లేకుండా చేయాలని, వెల్లడించారు. జూలై 13 నాడు నేషనల్ డీ వార్మింగ్ ప్రోగ్రాం ( జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం ) సంధర్భంగా ఆక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని చెప్పారు. లైన్ డిపార్ట్మెంట్స్ కలిసి ప్రోగ్రాం సక్సెస్ చేయాలని, మాపప్ ప్రోగ్రాం 20 నాడు నిర్వహించాలని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని, మందులను, వ్యాక్సిన్ లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణకు. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, సమిష్టి కృషితో పటిష్ట ప్రణాళికతో ముందు చూపుతో వ్యవహరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గణేశ్వర్, డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ శివ దయాళ్, జిల్లా విద్యా శాఖాధికారి, రాజు, డి.డబ్లు.ఓ, హేమ భార్గవి, డి.పి.ఓ, యాదయ్య, డి.పి.అర్.ఓ, రామచంద్ర రాజు, డిప్యుటి డి.ఎం.హెచ్.ఓ డా.సృజన, డా.జయమాలిని, ప్రోగ్రాం అధికారులు డాక్టర్.నవ్య, డాక్టర్.హరి ప్రసాద్, డాక్టర్ జయశ్రీ, నర్సాపుర్, తూప్రాన్, రామాయంపేట, మెదక్ మునిసిపల్ కమిషనర్లు, పి.హెచ్.సి.మెడికల్ ఆదిసర్లు, ఎం.ఎల్.హెచ్.పి.లు, సూపర్వైజర్లు ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారం వేగవంతం చేయాలి

- **డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలి.**
- **నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు,**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 2(జన సంఘర్షణ)

మెదక్, సురక్ష ప్రతినిధి: ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు, అధికారులను ఆదేశించారు. గురువారం నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధి నిర్వహణ, స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, వాటి పరిష్కార ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సృజనకు సూచించారు. కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా సమయపాలనతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షిస్తూ ట్రాఫిక్ నియంత్రణతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ,




ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ, ప్రధాన కూడళ్లు, వ్యాపార ప్రాంతాలు, ఇతర కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శక పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ తనిఖీలో రామాయంపేట్ సీఐ సైదా, ఎస్ఐ సృజనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ బాధితుడిని పరామర్శించిన కంఠరెడ్డి తిరుపతిరెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 2: (జన సంఘర్షణ)



మెదక్ మండలం జానకంపల్లి గ్రామానికి చెందిన వనబోయిన. శ్రీకాంత్ ఇటీవల గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు.మెదక్‌లోని జేమ్ కేర్ హాస్పిటల్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి గురువారం జేమ్ కేర్ ఆస్పత్రికి చేరుకుని శ్రీకాంత్‌ను పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని కోరారు. మెరుగైన చికిత్స అందించి త్వరగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీకాంత్ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వీరి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్యరెడ్డి,జానకంపల్లి,చిట్యాల మాజీ సర్పంచ్ లు సంగమేశ్వర్, వెంకటేశం, బిఆర్ఎస్వి నియోజకవర్గ నాయకులు గంజి నవీన్, నాయకులు సిద్దిరాములు, చంద్రమోహన్ గౌడ్, తలారి సంతు, వడ్ల నాగరాజు సాయి తదితరులు ఉన్నారు.

# నర్సంపల్లి గ్రామానికి చెందిన విజయ రాజుల కూతురు సుమ వివాహానికి పుస్తె మట్టెలు అందజేత

- **కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 2 (జన సంఘర్షణ)



దుబ్బాక నియోజకవర్గం నార్సింగి మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన విజయ - రాజు కూతురు సుమ వివాహానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై పూస్తేమట్టేలు అందజేసి నవ వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చత్రు, తేజు,త ఁకారం, రాజు, రవీందర్, షౌకత్ పల్లి సర్పంచ్ బాబు, లాలు, సురేష్, బాలకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం తనిఖీ

పోతంగల్./ జూలై 2 /(జన సంఘర్షణ)



పోతంగల్ మండలంలోని హంగర్గా ఫారం, గ్రామంలో గురువారం పోతంగల్ మండల విద్యాశాఖ అధికారి సాయిలు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. వంట చేసే సిబ్బందికి వివరాలు అడిగారు. కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, అనుజ, స్థానిక నాయకులు ఫిరోజ్, ఉప సర్పంచ్ పాషా , పంచాయతీ సెక్రెటరీ అనిత, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ


పోతంగల్../. జులై 2/జన సంఘర్షణ)



మాదాల చారిటబుల్ ట్రస్టు వర్ని, వారి ఆధ్వర్యంలో పోతంగల్ మండలంలోని హంగర్గా ఫారం, జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో విద్యార్థులకు మాదాల చారిటబుల్ ట్రస్ట్ వారు బ్యాట్స్ పంపిణీ చేశారు. పోతంగల్ మండల విద్యాశాఖ అధికారి సాయిలు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులక మాదాల చారిటబుల్ ట్రస్ట్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హంగర్ గా ఫారం సర్పంచ్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవడం పిల్లలకు చాలా గర్వకారణమని తెలిపారు. స్థానిక నాయకుడు ఫిరోజ్ మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి పరీక్షల్లో ఉన్నత స్థానం వచ్చిన వారికి మాదాల చారిటబుల్ ట్రస్ట్ తరఫునుండి ప్రతి సంవత్సరం స్కాలర్షిప్ ను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, అనుజ, స్కూల్ చైర్మన్, ఫాషిదా బేగం, మాదాల చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్, కామేపల్లి ఠాగూర్, కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామ ఉపసర్పంచ్ పాషా , ఉమ్మడి మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాంద్ పాషా, మైనారిటీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 2 (జన సంఘర్షణ)



గాజులగూడెం గ్రామానికి చెందిన పుట్టాల సాయిలు మరణించడం జరిగింది. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెల్సుకున్న బీఆర్ఎస్ పార్టి మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి గారు వారి కుటుంబానికి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో బాలగౌడ్ ఉపసర్పంచ్ దుర్గయ్య ఆనంతి మంగలి శివరాం ముత్తయ్య లక్సమయ్య, స్థానిక నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
శుక్రవారం 03 జులై 2026

# మా ఊరికి దారేది...?

- 70 కుటుంబాల 50 ఏళ్ల నిరీక్షణ... సీతారాంపురానికి రహదారి ఎప్పుడూ?
- వంతెనల లేమితో వాగులే అడ్డంకి... ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని జీవనం

వెంకటాపురం/జూలై 2/ (జన సంఘర్షణ)

ములుగు జిల్లా, వెంకటాపురం మండలం అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా... ఆ అభివృద్ధి ఫలాలు మాత్రం ఇంకా కొన్ని మారుమూల గ్రామాలకు చేరలేదు. అందుకు నిలువెత్తు ఉదాహరణ ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని సీతారాంపురం ఆదివాసీ గ్రామం. దాదాపు 50 ఏళ్లుగా 70 ఆదివాసీ కుటుంబాలు ఈ గ్రామంలో నివసిస్తున్నాయి. కానీ గ్రామానికి వెళ్లేందుకు ఇప్పటికీ సరైన రహదారి లేదు. గ్రామానికి చేరుకోవాలంటే పూసువాగు, ఓటిగుంట వాగులను దాటాల్సిందే. ఈ రెండు వాగులపై వంతెనలు లేకపోవడంతో వర్షాకాలం వస్తే గ్రామం పూర్తిగా బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోతుంది.

**వర్షం అంటేనే భయం...**

సాధారణంగా కురిసే వర్షమే సీతారాంపురం ప్రజలకు శాపంగా మారుతోంది. వాగులు ఉప్పొంగితే గ్రామస్థులు బయటకు రాలేరు. బయటివారు గ్రామంలోకి వెళ్లలేరు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చినా, గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారిని తరలించాల్సి వచ్చినా గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో ప్రత్యామ్నాయ దారుల ద్వారా ప్రయాణించాలంటే రెండు నుంచి మూడు గంటల సమయం పడుతోంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ఈ ఆలస్యం ఎంత ప్రమాదకరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు

**ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని జీవనం**

వర్షాకాలం ప్రారంభమైందంటే చాలు... సీతారాంపురం ప్రజల్లో ఆందోళన మొదలవుతుంది. ఎప్పుడు వాగు ఉప్పొంగుతుందో... ఎప్పుడు గ్రామం బందీ అవుతుందో... ఏ అత్యవసర పరిస్థితి వస్తుందో అనే భయంతో రోజులు గడుపుతున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లాలన్నా, రైతులు మార్కెట్‌కు వెళ్లాలన్నాఅనారోగ్యంతో ఉన్నవారు వైద్యం పొందాలన్నా... ప్రతి అడుగు ప్రమాదంతోనే సాగుతోంది. "ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బ్రతకాల్సిన పరిస్థితి" అంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నో వినతులు... ఫలితం శూన్యం**

గ్రామస్థులు ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తమ సమస్యను వివరించారు. రహదారి నిర్మాణంతో పాటు పూసువాగు, ఓటిగుంట వాగులపై వంతెనలు నిర్మించాలని పలుమార్లు కోరారు. హామీలు తప్ప ఆచరణ మాత్రం కనిపించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.


**అభివృద్ధి ఎక్కడ..?**

ఒకవైపు అభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతుల గురించి గొప్పలు చెబుతున్న ప్రభుత్వం... మరోవైపు స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాలు గడిచినా కనీస రహదారి కూడా లేని సీతారాంపురం. ఇది అభివృద్ధి అసమానతలకు నిదర్శనంగా నిలుస్తోంది.

**ప్రజల డిమాండ్**

సీతారాంపురానికి వెంటనే అన్ని కాలాల్లో ఉపయోగపడే రహదారి నిర్మించాలి. పూసువాగు, ఓటిగుంట





వాగులపై శాశ్వత వంతెనలు నిర్మించాలి. అత్యవసర వైద్య సేవలు గ్రామానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న సీతారాంపురం ప్రజల ప్రశ్న ఒక్కటే... "మా గ్రామానికి రహదారి ఎప్పుడొస్తుంది?" వర్షం వస్తే ప్రపంచానికి దూరమవుతున్న ఈ 70 కుటుంబాల గోడును అధికారులు ఎప్పుడు వింటారు? ప్రాణాలను పణంగా పెట్టి బతుకుతున్న ఈ ఆదివాసీ గ్రామానికి ఎప్పుడు విముక్తి లభిస్తుంది? లేక మరో వర్షాకాలం కూడా ఇదే దుస్థితిలో గడవాల్సిందేనా.

# గిరి వికాసమే వనవాసీ లక్ష్యం

- సమాజహిత కార్యక్రమాలకు సహకరించండి
- సంకల్పం ఉంటే ఏదయినా సాధ్యమే
- చర్లలో శబరి బాలికా నిలయం ప్రారంభించిన రామచంద్రయ్య

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం,జూలై 2 (జనసంఘర్షణ):

చర్లలో గిరిజన వికాసమే లక్ష్యంగా వనవాసీ కల్యాణ పరిషత్ పనిచేస్తోందని వనవాసీ కళ్యాణ పరిషత్ అఖిల భారత ప్రశిక్షణ సదస్యులు కొరివింజ రామచంద్రయ్య అన్నారు. గిరిజన బాలికల కొరకు వనవాసీ ఆద్వర్యంలో చర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన శబరి బాలికా విద్యాలయాన్ని రామచంద్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా నిలయ కార్యదర్శి బందా స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వనవాసీ ఆద్వర్యంలో దేశ వ్యాపితంగా గిరిజన విద్యార్దుల కొరకు 254 విద్యార్ది నిలయాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో 206 బాలుర, 48 బాలికల నిలయాలు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటి బాలికా నిలయం చర్లలో ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. సంకల్పం ఉంటే ఏదయినా సాదించవచ్చనడానికి చర్లలో బాలికా నిలయం ఏర్పాటు వేయడమే నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే ఇక్కడ బాలుర కొరకు కొమరం భీం విద్యార్ది నిలయం నిర్వహిస్తున్నామని, దీనికి తోడుగా ఈ ప్రాంతంలో తిరగాడిన శ్రీరామచంద్రమూర్తి భక్తురాలు శబరి పేరిట బాలికా నిలయం ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. త్వరలో దాత జవ్వాది కోదండ రాంబాబు,





సుమతి రామ్ దంపతులు విరాళంగా అందచేసిన జూనియర్ కళాశాల ఎదురుగా గల భూమిలో రూ. కోటి వ్యయంతో బాలికల కొరకు నూతన భవనం నిర్మిస్తామని వెల్లడించారు. అంత వరకు తాత్కాలికంగా వారి నివాసంలోనే నిలయం నిర్వహిస్తామని తెలిపారు. కొమరం భీం నిలయం అద్బుతంగా పనిచేస్తోందని, దీనికి సహకరించిన విదంగానే బాలికా నిలయంకు కూడా సహకరించి గిరి వికాసంలో ప్రతి ఒక్కరూ బాగస్వాములు కావాలని కోరారు. ఇటువంటి సమాజ హిత కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో అదిలాబాద్ జిల్లా తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే అదికంగా గిరిజనులు నివసిస్తున్నారని, వీరి కొరకు విద్యార్ది నిలయాలు, ఏకోపాద్యాయ పాఠశాలలు, వైద్య శిభిరాలను నిర్వహించి వారి సంక్షేమం కొరకు సంస్ద కృషి చేస్తోందని వెల్లడించారు. దేశం ప్రగతి పథంలో పయనించాలంటే మనలో చైతన్యం కలగాలని అన్నారు. ప్రతి హిందూవు మద్యం, గోమాంసంకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. డాక్టర్ హెగ్డేవార్ ఒక్కరిగా ఆర్ ఎస్ ఎస్ ను ప్రారంబించారని నేడు లక్షల మంది కార్యకర్తలు కలిగి, ప్రపంచ వ్యాపితంగా విస్తరించి సమాజ వికాసంలో కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. హిందూ వికాసానికి కృషి చేసే సంఘ్ కు వందేల్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ వ్యాపితంగా మొదటి మొదటిసారి చర్లలో హిందూ సమ్మేళనం నిర్వహించామని ఇలా రాష్ట్ర వ్యాపితంగా 350 హిందూ సమ్మేళనంలను నిర్వహించగా కార్యక్రమాలకు పెద్ద ఎత్తున హిందూ బందువులు తరలిరావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రాశ్చాత్య సంస్కృతికి దూరంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వనవాసీ ప్రాంత విద్యా ప్రముఖ్ మైసర్ల శంకర్, ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, కోరం సూర్యనారాయణ, కోరెం రామారావు, తాటి పాపారావు, మల్లాది సుబ్రహ్మణ్యం, గొంది శోభన్‌బాబు, జవ్వాది మురళీకృష్ణ, గోగికార్ రాంలక్ష్మణ్, వేములపల్లి ప్రవీణ్ బాబు, శివరాజు కిషోర్, కీర్తి సురేష్, ఇరసవడ్ల రాము, మీసాల శ్రీనివాస్, శ్రీకర్, గాదె శంకర్ బాబు, నిలయ ప్రముఖ్ లు సాంబయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నిబంధన ప్రకారం మౌలిక వసతులు కల్పించాలి

- రామాయంపేట మండల విద్యాధికారి శ్రీనివాస్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 2: (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వ నిబంధనలు ప్రకారము పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించి నిబంధనల మేరకు ట్యూషన్ ఫీజులు వసూలు చేయాలని మండల విద్యాధికారి కోరారు.

# అక్బర్ నగర్‌లో రోడ్డు ప్రమాదం

- బైక్‌పై ఉన్న ఇరువురికి గాయాలు

రుద్రూరు /అక్బర్ నగర్/జూలై 2/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండలం అక్బర్ నగర్ గ్రామంలోని పోచారం శ్రీనివాస్ రెడ్డి కాలనీ డబుల్ బెడ్ రూమ్ సమీపంలో మూలమలుపు వద్ద ఇద్దరు బైకుపై ఇంటికి వెళు తుండగా రోడ్డు ప్రమాదంలో గాయాలపాలు అయ్యారు. వెంటనే వీరికి స్థానికులు 108 ద్వారా చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది. మూల మలుపు అతి ప్రమాదకరంగా ఉందని స్పీడ్ బ్రేకర్లు కానీ అదేవిధంగా ప్రమాదపు సూచికలు లేక పోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.





# రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి

- మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదు కలెక్టర్ ప్రతి మాసింగ్.
- యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 2 (జన సంఘర్షణ)



జిల్లాలో యూరియా సరఫరా పై కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్, మార్క్ ఫెడ్‌లో 3617 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ కలదన్నారు. ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నాం అని వివరించారు. రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటి వరకు 53,297 రైతులు 5706 మెట్రిక్ టన్నుల యూరియా కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు.

# రామాయంపేట పట్టణ, మండలంలో 32,929 ఓటర్లు నమోదు

- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 2 (జన సంఘర్షణ)

| 2 | Mandal name | Total Elector | Total EFs Distributed | % of EF distributed |
|---|---|---|---|---|
| 3 | Medak | 56809 | 43822 | 77.14 |
| 4 | Ramayampet | 32929 | 26214 | 79.61 |
| 5 | Papannapet | 42183 | 35828 | 84.93 |
| 6 | H.ghanpur | 30982 | 24967 | 80.59 |
| 7 | Spet R | 31151 | 29533 | 94.81 |
| 8 | Nizampet | 21206 | 18199 | 85.82 |
| 9 | Narsing | 5167 | 5032 | 97.39 |
| 10 | Total | 220427 | 183595 | 83.29 |

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ మండలంలో 32,929 ఓటర్లు నమోదై ఉన్నారు . వారిలో ఇప్పటివరకు ఈ ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుండి నేటి వరకు బిఎల్వోలు గ్రామాలలోని బూతులలో ఓటర్ సవరణ పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఇప్పటివరకు 26,214 ఫామ్స్ పంపిణీ చేయడం జరిగింది. జులై 24 వరకు పంపిణీ కార్యక్రమం పూర్తి చేసిన ఫామ్స్ ను తిరిగి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ భూత అధ్యక్షుడు బిఎల్ఎ 2 లు , మండల పట్టణ అధ్యక్షులు చురుకుగా పాల్గొంటున్నారు. ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా ఓటర్లు ఏ ఇబ్బంది పడొద్దు అని విజ్ఞప్తి మీకు ఎక్కడ ఇబ్బంది వచ్చినా మమ్ములనుసంప్రదించవలసిందిగా కోరుతున్నాం.

# రుద్రూర్ మండలంలో ఒకే ఒక్క ఏఈఓ పెరిగిన పనిభారంతో రైతుల అవస్థలు

రుద్రూర్/జూలై 2/(జన సంఘర్షణ)




రుద్రూర్:నిజామాబాద్ జిల్లాలోని బోధన్ డివిజన్ పరిధిలో గల రుదురు మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారులు సరిపడ లేకపోవడంతో పని భారం అధికమవుతుంది. రుద్రూర్ మండల కేంద్రంలో సుమారు ముగ్గురు విస్తీర్ణ అధికారులు పనిచేయాల్సి ఉన్నప్పటికీ వ్యవసాయ శాఖ అధికారి తో పాటు వి స్తీర్ణ అధికారి ఒక్కరే పని చేస్తున్నారు. ఒక క్లస్టర్ లో 5వేల ఎకరాలు ఉండాలి. రుద్రూర్ మండలం లో 8750 ఎకరాల విస్తీర్ణం అధికంగా ఉండడం తో 2018నుండి వరకు ఇద్దరు విస్తీర్ణ అధికారులు గా పని చేశారు. ప్రస్తుతం ఒక్కరే విస్తీర్ణ అధికారి ఉండడడం తో భూమి విస్తీర్ణం అధికామవ్వడం తో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలులో జాప్యం అవుతుంది. గతంలో కంటే ప్రస్తుతం పనిభారం పెరగడంతో పాటు యాఫ్ లు, వరి కొనుగోళ్ళ సమయం లో ఇబ్బందులు తప్పడం లేదు దీంతో రైతుల కు అనేక అవస్థలు ఎదురైఔతున్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో మాదిరి ఇద్దరు అధికారులను నియమించి రెండు క్లస్టర్ల లో రైతుల సౌలభ్యం కోసం ఇద్దరు విస్తీర్ణ అధికారులను నియమించాలాని రుద్రూర్ మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్సై అయితే నీ ఇష్టం వచ్చినట్టు చేస్తావా

- ఎస్సైని మధ్యాహ్నం వరకు నిలబెడే ఉండాలని హైకోర్టు జడ్జీ ఆదేశాలు
- మధురా నగర్ ఎస్సై తీరుపై ఆగ్రహం

హైదరాబాద్,/ జూలై 2/(జన సంఘర్షణ)



ఖాకీ చొక్కా వేసుకున్నంత మాత్రాన చట్టాలు మాకు చుట్టాలు అనుకునే కొందరు పోలీసు అధికారుల అహంకారానికి న్యాయస్థానం గట్టిగా ముకుతాడు వేసింది. సమాజంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే స్వయంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అత్యంత అమానుషంగా ప్రవర్తిస్తే న్యాయవ్యవస్థ చూస్తూ ఊరుకోదని ఈ తాజా ఘటన స్పష్టం చేస్తోంది. ఒక రిటైర్డ్ అధికారి పట్ల మధురానగర్ ఎస్సై ప్రవర్తించిన తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధించిన శిక్ష ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నిశితంగా పరిశీలిస్తే పోలీసుల మితిమీరిన ప్రవర్తన స్పష్టంగా కనిపిస్తోంది. మే 18న యూసుఫ్గూడలోని తన నివాసంలో ఉన్న రిటైర్డ్ ఎస్సై ఉస్మాన్ ను మధురానగర్ పోలీసులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా బలవంతంగా ఈడ్చుకెళ్లారు. కేవలం అండర్ వేర్, బనియన్తో మాత్రమే ఉన్న ఆ వృద్ధుడిని కనీసం బట్టలు కూడా వేసుకోనివ్వకుండా ఇంటి నుండి దారుణంగా లాక్కెళ్లడం తీవ్ర కలకలం రేపింది. ఈ అన్యాయంపై బాధితుడు హైకోర్టును ఆశ్రయించగా జస్టిస్ టీ మాధవీదేవి ధర్మాసనం ఈ పిటిషన్పై సుదీర్ఘ విచారణ చేపట్టింది. గురువారం విచారణ సంధర్భంగా బాధితుడి పరిస్థితిని పోలీసుల అరాచకాన్ని తీవ్రంగా పరిగణించిన గౌరవ న్యాయమూర్తి సదరు మధురానగర్ ఎస్సైపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎస్సై అయితే నీ ఇష్టం వచ్చినట్లు చేస్తావా అని వీవీ పోలీస్ అయినంత మాత్రాన దేశ చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తావా అంటూ కోర్టు బోనులో ఉన్న అధికారిపై ధర్మాసనం నిప్పులు చెరిగింది. చట్టాన్ని రక్షించాల్సిన వ్యక్తులే ఇలాంటి అనాగరిక చర్యలకు పాల్పడితే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తూ సదరు ఎస్సైని మధ్యాహ్న భోజన సమయం వరకు అంటే లంచ్ అవర్ ముగిసేంత వరకు కోర్టులోనే నిలబడాలని ఆదేశించి సంచలన శిక్ష విధించింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్రమైన విచారణ జరపాలని భావించిన హైకోర్టు తదుపరి చర్యల కోసం కఠినమైన ఆదేశాలను జారీ చేసింది. ఈ ఘోర ఘటనకు సంబంధించి నగర పోలీస్ కమిషనర్ నుంచి పూర్తి స్థాయి నివేదికను తెప్పించుకుని తమకు అందజేయాలని ప్రభుత్వ న్యాయవాదిని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఖాకీ నిరంకుశత్వానికి అడ్డుకట్ట వేయకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని భావించిన కోర్టు ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది. ఈ రకమైన పరిణామాలు సమాజంలో పోలీసుల బాధ్యతను చట్టం ముందు అందరూ సమానులే అనే నిజాన్ని మరోసారి గుర్తుచేస్తున్నాయి.

## రుద్రూర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం





రుద్రూరు/జూలై 2/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని కట్టెల మండి సమీపంలో అంగడి బజార్ దాటిన పిదప బోధన్ కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై మనోజ్, ఏ ఎస్సై సత్తయ్య పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అయితే బోధన్ పట్టణానికి చెందిన వ్యక్తి మతిస్థిమితం లేక తిరుగుతూ ఉండే వాడని, రాత్రి ఇంటి నుంచి బయలుదేరిన ఆయన రుద్రూరు ప్రధాన రహదారి పక్కన ఫిట్స్ వచ్చి మృతి చెంది ఉండవచ్చు అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే సమాచారం కుటుంబీకులకు చేరడంతో ప్రస్తుతం వారు రుద్దూర్ కు వస్తున్నట్టు స్థానికులు ద్వారా సమాచారం.

## ప్రభుత్వ ప్రైమెరీ పాఠశాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్ డిఎం ప్రవీణ్, డిసిఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి

నిజామాబాద్ జిల్లా,రుద్రూర్, జూలై 02( జన సంఘర్షణ):



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో ఈరోజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రుద్రూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ కాలనీ స్కూల్ గల ప్రేమరి ప్రభుత్వ పాఠశాలను బుధవారం 11 గంటల 30 నిమిషాలకు స్పెషల్ ఆఫీసర్ ఎం డి ఎం ప్రవీణ్. డి సిస్ ఓ శ్రీకాంత్, రెడ్డిలు సశీదర్శించారు. పాఠశాలలో వంటగది పరిశీలించి పాఠశాల పక్కన ఉన్న శీథిలావస్థకు చేరిన భవనాన్ని పరిశీలించారు పాఠశాల పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని ఈ విషయం పై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి డివిజన్ ప్రెసిడెంట్‌గా దెంది అరవింద్ రెడ్డి నియామకం

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 02, (జన సంఘర్షణ):



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ బి. మహేష్ కుమార్ గౌడ్, కూకట్‌పల్లి ఇంచార్జి కమ్మ కార్పొరేషన్ అధ్యక్షుడు బండి రమేష్ అధ్యక్షతన కీలక ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ తోటకూర వజ్రేష్ యాదవ్‌తో సంప్రదింపులు జరిపిన అనంతరం, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్ల ప్రెసిడెంట్ల నియామకాలను ఖరారు చేశారు. ఈ నియామకాల్లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కెపిహెచ్‌బి కాలనీ (డివిజన్ నెం. 252) ప్రెసిడెంట్‌గా దెంది అరవింద్ రెడ్డి నియమితులయ్యారు. ఈ నియామకాలు తక్షణమే అమలుల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన డివిజన్ ప్రెసిడెంట్లు అందరూ క్షేత్రస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడానికి శ్రమించాలని మరియు సంస్థాగత నిర్మాణానికి కట్టుబడి పనిచేయాలని బి. మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

## మంగపెట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టు పెళ్లి వెంకటేశ్వర్ల

◆ **సన్మానించిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ**

ములుగు జిల్లా, మంగపేట మండలం, జులై 02(జనసంఘర్షణ):



మంగపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన చెట్టుపల్లి వెంకటేశ్వర్లు ను యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి సన్మానించిన జరిగింది. ఈ సందర్భంగా మండల యూత్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ మాట్లాడుతూ.. మండలంలో యూత్ కాంగ్రెస్ సమస్యలను పరిష్కరించాలని యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పూజారి సురేంద్రబాబు, మండల అధ్యక్షులు కురుసం రమేష్, ములుగు జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ మురుకుట్ల నరేందర్, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శిలు జాడి మురళి, పిట్ట నాగేంద్రబాబు, మల్లూరు ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ బొడ్డు సుధాకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు బేత వెంకటేష్, కోరం మొగిళి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే స్కూల్ బస్సులు సీజ్!

బోధన్/జూలై 2/(జన సంఘర్షణ)



బోధన్ అంబేద్కర్ చౌరస్తా వద్ద మోటార్ వెహికల్ అధికారులు ప్రైవేట్ స్కూల్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫిట్నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ కిట్లు లేని బస్సులకు జరిమానాలు విధించారు. కొన్ని వాహనాలను సీజ్ చేశారు. డ్రైవర్లకు లైసెన్స్తో పాటు ప్రతి 3 నెలలకు ఒకసారి మెడికల్ ఫిట్నెస్ తప్పనిసరి అని ఎంవీఐ మణికాంత్ వెల్లడించారు.

## బుక్స్‌లు అమ్ముతున్న వైనంపై విరుచుకుపడ్డ పిడిఎస్యు










బోధన్/జూలై 2/(జన సంఘర్షణ)

ప్రైవేటు పాఠశాలలో బుక్స్ అమ్ముతున్న వైనంపై పిడిఎస్యు రాష్ట్ర నాయకులు గౌతం, కార్తీక్ తో పాటు ఇతర పార్టీ నాయకులు కలిసి బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల లో విక్రయాలు చేస్తున్న పుస్తకాల వైనంపై ఎంఈఓ ద్వారా పట్టుకొని ఎంఈఓ కార్యాలయానికి తరలించారు. ప్రైవేటు పాఠశాలలో బుక్స్ లు విక్రయాలు చేసి విద్యార్థులకు అన్యాయం చేస్తే సహించేది లేదని పి డి ఎస్ యు నాయకులు అన్నారు. బోధన్ డివిజన్ తో పాటు బోధన పట్టణంలో ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కానీ అదేవిధంగా నిబంధనకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరికలు చేశారు. గత రెండు రోజుల క్రితం ఈ వైనం నెలకొంది. చందూరు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల సైతం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు పట్టుకున్న వైనం కలకలం రేపు తుంది. అయితే ఇంకా అనేక పాఠశాలలో ఇలాంటి వైనం ఉన్నప్పటికీ కేవలం ఇలాంటి పాఠశాలను ఎందుకు టార్గెట్ చేసినారు దీని వెనక మతలబు ఏమిటి అనే కోణంలో కూడా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## ఉపాధ్యాయురాలుగా అవతారం ఎత్తిన కలెక్టర్

◆ **కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్..**





నిజామాబాద్/జూలై 2/(జన సంఘర్షణ)

రెంజల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసరాలను, కిచెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు పాములు, విష కీటకాల బారినపడితే ఎవరు బాధ్యులని నిలదీశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, వర్షపు నీరు నిలువ ఉన్న గుంతలలో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది అటెండెన్స్ వివరాలను అడిగి తెలుసుకుని, మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. నాసిరకం బియ్యం, సరుకులు సరఫరా చేస్తే వెంటనే మండల అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఆర్.ఓ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్నిబాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకూడదని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, తాను వారం రోజుల తర్వాత మళ్లీ పాఠశాలను సందర్శిస్తానని, ఆలోగా అన్ని లోటుపాట్లను చక్కదిద్దుకోవాలని సూచించారు. అనంతరం పదవ తరగతి క్లాస్ రూమ్ ను సందర్శించి, విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని బాలికలకు జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాలికలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఈగలు వృద్ధి చెందకుండా వంటగది, డైనింగ్ హాల్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ శ్రవణ్, ఎంపీడీఓ కమలాకర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్యామల తదితరులు ఉన్నారు.

## బోధన్ ఉద్గిర్ గల్లి చెందిన యువకుడు ఫిట్స్‌తో మృతి

రుద్రూర్: జూలై 02( జన సంఘర్షణ)



రుద్రూర్ మండల కేంద్రం అనగా గురువారం జిల్లా పరిషత్ పాఠశాల వెళ్లే రహదారి పైన మూలమలుపు వద్ద గుర్తుతెలియని యువకుడు మృతదేవం కనిపియ్యడంతో రుద్రూర్ గ్రామంలో కలకలం. తేదీ:02-07-26న ఫిర్యాది మసూల్ అవిత గ్రామం ఉద్మిర్ గల్లి బోధన్ తెలుపనది ఏమనగా ఫిర్యాది భర్త మసూల్ సంజీవ్ కుమార, తండ్రి సాయన్న, వయస్సు 44, కులం మున్నూరు కాపు, వృత్తి వ్యవసాయం, మసూల్ సంజీవ్ అనే వ్యక్తికి గత ఏడు సంవత్సరాలుగా మానసికంగా బాగాలేదు, తేదీ:01.07.26న ఇంటి నుండి వెళ్లి తిరిగి రాకపోక ఈరోజు ఉదయం రుద్రూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రహదారిలో రోడ్డుపై బోర్లపడి ఫిట్స్‌తో చనిపోయాడనే బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు, ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ చేయనైనది. పోలీసులు శాఖ తెలిపారు.

## పాఠశాలలను సందర్శించిన గ్రామ సర్పంచ్ ఇందూర్ సునీత

నిజామాబాద్ జిల్లా,రుద్రూర్ మండలం,జూలై 02( జన సంఘర్షణ):



రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాల, రైతు వేదికలను మంగళవారం గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా సరైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదేవిధంగా రైతు వేదికను సందర్శించి రైతు వేదిక పక్కన ఉన్న టాయిలెట్స్‌ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సర్పంచ్ వెంట సెక్రటరీ ప్రేమ్ దాస్, ఎంపీఓ అరవింద్, తదితరులు ఉన్నారు.

## షెడ్యూల్ క్యాస్ట్ ఆఫీస్ ఎక్కడ..?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం, జులై 2(జనసంఘర్షణ):



కొత్తగూడెంలో ఏ ఎస్ డబ్ల్యూ ఆఫీస్‌కి బోర్డు పెట్టకుండా,సమాచార చట్ట బోర్డు, ఏ ఎస్ డబ్ల్యూ ఓ కూడా లేకుండ ఆఫీస్‌నే మీరు నిర్వీర్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి, 2024 నుండి కరెంటు లేకుండా, వాటర్ లేకుండా, ఆఫీసు ముందు పేరు బోర్డు లేకుండా, కనీసం ఆఫీసులో సమాచార బోర్డు లేకుండా అసలు ఏ ఎస్ డబ్ల్యూ ఓ నే లేకుండా షెడ్యూల్ క్యాస్ట్ ఆఫీసుని నిర్వీర్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రగతి శీల యువజన సంఘం (పివైఎల్), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు ముసలి సతీష్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం ఐఎఫ్టియు కార్యాలయంలో జరిగిన కొత్తగూడెం ఏరియా పి వై ఎల్ ముఖ్య కార్యకర్తల సమావేశం పివై ఎల్ పట్టణ కార్యదర్శి లిక్కి నరేష్ అధ్యక్షతన జరిగింది. అనంతరం ఈ సమావేశంలో ముసలి సతీష్ మాట్లాడుతూ.. ఏ ఎస్ డబ్ల్యూ ఓ ఆఫీసు కొత్తగూడెంలో ఉన్నట్టు ఎవరికి తెలియదని అయితే ఒక డివిజన్ కేంద్రంగా నాలుగు మండలాలకు కేంద్రంగా ఉన్న ఈ ఆఫీసుని ఎదురులేని పేరుతోటి, కరెంటు కట్ చేసి,వాటర్ కట్ చేసి, అసలు బోర్డే లేకుండా, అధికారులు లేకుండా, నడిపిస్తున్నారని, ఇది సరైనది కాదని వారన్నారు. ఒకవేళ డివిజన్ కేంద్రంలో ఉండాల్సిన ఆఫీసుని కలెక్టర్ ఆఫీస్ తరలించాలని ఆలోచనలు కూడా విరమించుకోవాలని వారు అన్నారు. దేవుని కేంద్రంగా ఉండే ఆఫీసులో చుట్టుపక్క మండలాల నుండి కళ్యాణ్ లక్ష్మి ఎస్సీ రుణాల కోసం సబ్సిడీల కోసం క్యాస్ట్ అలాగే విద్యార్థుల మెనూ వారి యొక్క పేర్లు తప్పుల గురించి ఇలా ఎన్నో సమస్యలతో విద్యార్థులు ప్రజలు యువకులు అధికారులు వస్తారని అప్పుడు ఇక్కడ డివిజన్ కేంద్రంలో లేకుండా జిల్లా ఆఫీసులో ఉంటే అక్కడదాకా దూరప్రాంతాలకు పోవాల్సి వస్తుందని వారు అన్నారు, కావున ఇక్కడ కొత్తగూడెం పట్టణంలో 9 హాస్టల్స్ ఉన్నాయని,ఆ హాస్టల్స్ లో ఎక్కడో అక్కడ రూమ్ లో పెట్టి నడిపించవచ్చని వారు అన్నారు, కావున డివిజన్ కేంద్రంలో ఉండవలసిన ఆఫీసు డివిజన్ కేంద్రంలోనే ఉంచాలని నడిపించాలని అందుబాటులోకి ఆఫీసు సేవలను తీసుకురావాలని వారి పిలుపునిచ్చారు. ఇట్టి విషయంపై కలెక్టర్ ని కూడా కలిసి విన్నవిస్తామని పి వై ఎల్ గా తెలియజేస్తున్నాం.ఈ సమావేశం లో పట్టణ కార్యదర్శి లిక్కి నరేష్, నాయకులు జయరాజ్, రాజేష్, అభినయ్, కమల, నాగమణి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ అధికారులు సందర్శించాలి

◆ **బీడీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం డిమాండ్**







**నిజామాబాద్ జిల్లా,బోధన్: జూలై 02(జనసంఘర్షణ):** బోధన్ పట్టణం లో బీడీసఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బోధన్ పట్టణంలోని స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందర,బీడీసఫ్, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి. అనంతరం విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సంజయ్ తల్లారే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారాయని ఆయన అన్నారు, మండల కేంద్రంలో కనీస సౌకర్యాలు లేకుండా ప్రభుత్వ బడులు నడుస్తున్నాయని ఆయన తెలియజేశారు, కనీస మౌలిక సదుపాయాలు లేవని విద్యార్థులు మూత్రశాలలు, మరుగుదొడ్ల అదేవిధంగా వర్షాకాలం సీజన్ వ్యాధులు సంబంధించిన మెడిసిన్లు ఆయా పాఠశాలలో పెట్టాలని ఆ విధంగా చొరవ తీసుకోవాలని బీడీఎస్ఎఫ్ విద్యార్థి సంఘంగా తమ ద్వారా కోరుతున్నామని అన్నారు. మండల కేంద్రంలో మధుమలాంచ స్కూల్ ఆకతాయిలకు అడ్డగా మారిందని రాత్రి అయితే చాలు అక్కడ బీర్ సీసాలు అదేవిధంగా ఆ సాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని వారి పైన చట్టరిటా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా స్కూల్ కి ప్రవాహ కూడా నిర్మించి పాఠశాలకు రాత్రి సమయంలో రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేతకు కుట్ర చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 23 వేల ప్రభుత్వ పాఠశాలను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలి, ప్రవేట్, కార్పొరేట్ స్కూలలో 25% సీట్లను పేద బహుజన విద్యార్థులకు కేటాయించే విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వస్తువులు కల్పించాలి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే 21 వస్తువుల కిట్లు అదేవిధంగా, పాఠ్యపుస్తకాలను, యూనిఫామ్స్ వెంటనే అందించాలి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్స్ తక్షణమే అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. విద్యాశాఖ అధికారులు కచ్చితంగా కార్యాలయానికి పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ముఖ్యంగా ప్రభుత్వ బడులలో తనిఖీలు నిర్వహించి హైస్కూల్లో ఉన్నటువంటి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి బహుజన విద్యార్థులకు న్యాయం చేకూర్చాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ అధ్యక్షులు శ్రీ కిరణ్, కార్యదర్శి నరేందర్, జిల్లా నాయకులు రాజు, దీపక్, లాలూ, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# డెకాయిటీ గ్యాంగ్'లో ఎస్ఐ, కానిస్టేబుల్!



**ఖమ్మం జిల్లా /జులై 2/(జన సంఘర్షణ)** ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో దోపిడీ ముఠా గురించి వివరిస్తున్న ఏసీపీ వసుంధర యాదవ్, చిత్రంలో ఇతర పోలీసు అధికారులు కూడా ఉన్నారు. దోపిడీ) కేసులోని మొత్తం 14 మంది నిందితుల ముఠాలో రిజర్వుడ్ విభాగానికి చెందిన ఓ సబ్ ఇన్స్పెక్టర్, మరో కానిస్టేబుల్ కూడా నిందితులుగా ఉన్న ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో వెలుగు చూసింది. ఒకటికి నాలుగు రెట్లు డబ్బు ఇస్తామంటూ నమ్మబలికి, ఫోన్లు చేసి, రప్పించుకున్న వ్యక్తులను పోలీసుల పేరుతో బెదిరించి దోపిడీకి పాల్పడుతున్న ఈ ముఠా గుట్టును సత్తుపల్లి పోలీసులు రట్టు చేసినపుడు ఈ అంశం బహిర్గతమైంది. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన కుర్రా గంగాధర్ రెడ్డి అనే బాధిత వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గత నెల 25వ తేదీన నమోదైన కేసులో సత్తుపల్లి పోలీసులు దోపిడీ ముఠాను అరెస్ట్ చేశారు. కల్లూరు ఏసీపీ వసుంధరా యాదవ్ గురువారం మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆమె కథనం ప్రకారం..

**ఇదీ ముఠా చేసే నేరం స్టైల్:..**


అమాయకులను మోసం చేసి, దొడ్డిదారిన డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో ఈ ముఠా మొబైల్ సిమ్ కార్డులను తీసుకుంటుంది. ఆయా సిమ్ ల ద్వారా ఏదో ఒక నెంబర్ కు ఫోన్ చేసి, ఎవరైనా ఫోన్ లిఫ్ట్ చేస్తే 'నా పేరు మహేందర్ రెడ్డి ఏ బాలగంగాధర్ ఏ చంద్రం ఏ చంటిబాబు వంటి పేర్లు చెబుతూ ముఠా అమాయకులను ముగ్గులోకి దించుతుంది.

తాము రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటామని, తమ ఎకౌంట్లో రూ. 2.00 కోట్ల బ్లాక్ మనీ ఉందని, ఆదాయపు పన్ను సమస్య ఉందని చెబుతుంటారు. ఆ బ్లాక్ మనీని తాము వైట్ మనీగా మార్చాలనుకుంటున్నామని, మీరు ఎవరైనా డబ్బు ఇస్తే అందుకు బదులుగా ఒకటికి నాలుగు రెట్లు డబ్బు ఇస్తామని నమ్మబలికేవారు. తాము నగదు రూపంలోగాని, అకౌంట్ ద్వారా గానీ చెల్లిస్తామని, నమ్మకం ఉంటే తాము చెప్పిన ప్రదేశానికి డబ్బు తీసుకుని వస్తే, తమ మనిషి అక్కడికి వస్తాడని చెప్పేవారు. వీరి మాటలు నమ్మి వచ్చిన వ్యక్తికి డబ్బును చూపి, అకౌంట్ నెంబర్ ఇస్తే ఒకటికి నాలుగు రెట్లు అధిక మొత్తాన్ని జమ చేస్తామని చెప్పేవారు. రూ. 10.00 లక్షలు ఇస్తే, రూ. 40.00 లక్షలు అకౌంట్ లో వేస్తామని, ఆ డబ్బు నుంచి మీరు రూ. 12.00 లక్షలు తీసుకుని, తమకు ఇచ్చిన రూ. 10.00 లక్షలుపోగా, మిగతా రూ. 18.00 లక్షలు తమకు నగదుగా ఇవ్వాలని మోసపు మాటలు చెప్పేవారు.

**మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్...**

ఈ మొత్తం ప్రక్రియలో ముఠాను నమ్మి వచ్చిన వ్యక్తులకు అదే ముఠాలోని ఓ సభ్యుడు వచ్చి చిల్డ్రన్స్ ఆడుకునే డమ్మీ కరెన్సీ నోట్లు ఉన్న బ్యాగును ఇచ్చి పంపేవారు. ఈ తతంగంలో ముఠాను నమ్మి వచ్చిన వ్యక్తి ఇచ్చిన ఒరిజినల్ నోట్లు ముఠాలోని సభ్యుడు లెక్కించే సమయంలో ముఠా ముందే ఏర్పాటు చేసుకున్న నకిలీ, ఒరిజినల్ పోలీసులు కార్లలో వచ్చి ఆ వ్యక్తిని బెదిరించేవారు. దొంగనోట్ల వ్యాపారం చేస్తున్నారని, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ అంటూ బెదిరిస్తే నమ్మి వచ్చిన వ్యక్తులనేగాక, తమ ముఠాలోని సభ్యున్ని కూడా పథకం ప్రకారం కొట్టేవాళ్లు. తద్వారా తమ ఫోన్ కాల్ ను విశ్వసించి డబ్బుతో వచ్చిన వ్యక్తులను ఇదే తరహాలో బెదిరించి దోచుకునేవాళ్లుఇలా అనేక మందిని మోసం చేసి, దోపిడీ ముఠాకు చెందిన మొత్తం 14 మంది నిందితుల్లో 12 మందిని సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయినవారిలో ఏలూరు జిల్లా కలిదిండి మండలం వెంకటాపురానికి చెందిన ఈద చంటిబాబు, ఖమ్మం జిల్లా తుంబూరుకు చెందిన ముళ్లగిరి వర్ధన్, ఏలూరు జిల్లా నర్సాపురానికి చెందిన ముప్పా సత్యనారాయణ, ఖమ్మం జిల్లా బేతుపల్లి గంగారానికి చెందిన బేరా కేశవరావు, చింతలపూడి మండలం మల్లాయగూడేనికి చెందిన మారుముడి మధు, వేంసూరు మండలం బీరవల్లికి చెందిన గోరంట్ల గౌతమ్, నేలకొండపల్లి మండలం సదాశివపురానికి చెందిన కర్లపూడి నవీన్, సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన నక్కా నాగరాజు ఉన్నారు. అదేవిధంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా కొడగట్టుపల్లికి చెందిన సాగి సుబ్బరాజు, సికింద్రాబాద్ లోని ఏఎస్ రావు నగర్ కు చెందిన కాపా శ్రీనివాస్, కర్నూలు జిల్లాకు చెందిన దుడుగురు కురబ గణేష్, సత్యసాయి జిల్లా ధర్మవరంమండలం రాజేంద్రనగర్ కు చెందిన ఉపేంద్రం కూడా అరెస్టయిన నిందితుల్లో ఉన్నారు.

# బోడుప్పల్ భూ పోరాటం సందర్భంగా తెలంగాణ రక్షక సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అరెస్ట్





**హైదరాబాద్ బోడుప్పల్/జూలై 2/(జన సంఘర్షణ)** బోడుప్పల్‌లో నిర్వహించిన భూపోరాట కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భూపోరాటం సందర్భంగా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేసి పోలీసు వాహనంలో తరలించారు. ఈ ఘటనతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ రక్షణ సేన నాయకులు ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు మాత్రం శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.


## కాంగ్రెస్ పార్టీ కైతలాపూర్ డివిజన్ ప్రెసిడెంట్‌గా కలికోట శంకర్ నియామకం



**హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 02, (జన సంఘర్షణ):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ బి. మహేష్ కుమార్ గౌడ్ , కూకట్‌పల్లి ఇంచార్జి కమ్మ కార్పొరేషన్ అధ్యక్షుడు బండి రమేష్ అధ్యక్షతన కీలక ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ తోటకూర వజ్రేష్ యాదవ్‌తో సంప్రదింపులు జరిపిన అనంతరం, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని వివిధ డివిజన్ల ప్రెసిడెంట్ల నియామకాలను ఖరారు చేశారు. ఈ నియామకాల్లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కైతలాపూర్ డివిజన్ ప్రెసిడెంట్‌గా కలికోట శంకర్ నియమితులయ్యారు. ఈ నియామకాలు తక్షణమే అమలుల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.?కొత్తగా నియమితులైన డివిజన్ ప్రెసిడెంట్లు అందరూ క్షేత్రస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడానికి శ్రమించాలని మరియు సంస్థాగత నిర్మాణానికి కట్టుబడి పనిచేయాలని బి. మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

## కామన్ సర్వీస్ సెంటర్ పిఏసీఎస్ ఆవరణలో చర్లలో ప్రారంభం

◆ **పరుచూరి రవికుమార్ పి ఏ సీ ఎస్ అధ్యక్షులు చర్ల**


చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, నందు ది. 04-07-2026 న ఉదయం 10 : 08 నిలకు సూతనముగా
కామన్ సర్వీస్ సెంటర్ (CSC)
ప్రారంభించబడును

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూలై 02(జనసంఘర్షణ):** భద్రాచలం నియోజకవర్గంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో చర్ల పి ఏ సీ ఎస్ నందు మొదటి సారిగా కామన్ సర్వీస్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగింది. కామన్ సర్వీస్ సెంటర్ నందు ఆన్ లైన్ ద్వారా ప్రజలకు వివిధ రకాల సేవలు అందించేందుకు, రైతులకు, ప్రజలకు పి ఏ సీ ఎస్ ను మరింత చేరువ చేస్తూ ప్రజలకు ప్రధాన సేవా కేంద్రముగా తీర్చి దిద్దుటకు, చర్ల పి ఏ సీ ఎస్ పాలక వర్గం కృషి చేస్తోంది. మా ఈ సేవ ఆధారిత వ్యాపారం సమర్థవంతంగా నిర్వహించుటకు ఉత్సాహవంతమైన చర్ల పి ఏ సీ ఎస్ సిబ్బంది తమ ఉద్యోగ వేళలు మించి ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజలకు సీ ఎస్ సీ సేవలను అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. కావున మా ఈ సేవలను ఉపయోగించుకుని ప్రజలు సీ ఎస్ సీ పురోభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ తేది:4-7-2026,శనివారం ఉదయం 10.08 గంటలకు గౌరవ ఏమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట రావు చేతుల మీదుగా చర్ల పి ఏ సీ ఎస్ నందు ప్రారంభించబడుతున్న కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవ్వగలరని రైతులను, వ్యాపారవర్గాల వారిని, యువతను, విద్యార్థులను,ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేఖరులను సాదరముగా ఆహ్వానిస్తూ తప్పక హాజరు కాగలరని కోరుతున్నాము.

## బీఎల్ఏ ఐడి కార్డు అందుకున్న కోడిరెక్కల వినోద్ కుమార్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూలై 02(జనసంఘర్షణ):**



చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ, బిఎల్ఏ ఐడి కార్డును కోడిరెక్కల వినోద్ కుమార్ అందుకున్నారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ.. బీఎల్ఏలు పార్టీకి బూత్ స్థాయిలో వెన్నెముకలని, ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కోడిరెక్కల వినోద్ కుమార్ కి శుభాకాంక్షలు తెలిపారు.

## బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ ఉద్యోగులు బహిరంగంగా మూత్ర విసర్జన

◆ **పట్టించుకోని అధికారులు**




**బాన్సువాడ/ జులై 2/(జన సంఘర్షణ)** బాన్సువాడ బస్టాండ్ ప్రాంగణంలో ప్రభుత్వం నిర్వహించిన మూత్ర శాలలు ఉండడం జరిగింది. అయినా కూడా బాన్సువాడ ఆర్టీసీ ఉద్యోగులు మాత్రం బహిరంగ ప్రాంతాలలో మూత్ర విసర్జన చేస్తున్నారు దాన్ని చూసి ప్రజలు విడ్డూర పడుతున్నారు , వీళ్లను చూసి స్థానిక ప్రయాణికులు అదే బాటలో నడుస్తున్నారు. దీనిపై వెంటనే బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆగ్రం వ్యక్తం చేస్తున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
శుక్రవారం
03 జులై 2026

# సత్యనారాయణపురం పీహెచ్‌సీ కి తిరిగి 108 అంబులెన్స్ కేటాయింపు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం నియోజకవర్గం, జులై 02(జనసంఘర్షణ ):

చర్ల మండల పరిధిలోని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఇటీవల చర్ల పీహెచ్ సీ కి తరలించిన 108 అంబులెన్స్‌ను తిరిగి కేటాయించాలని ఆర్.కొత్తగూడెం గ్రామస్తులు చేసిన విజ్ఞప్తికి స్పందించి, జిల్లా కలెక్టర్ నేడు సత్యనారాయణపురం పీహెచ్ సీ కి 108 అంబులెన్స్‌ను పునరుద్ధరించారు. ఈ అంబులెన్స్ తరలింపు వల్ల చుట్టుపక్కల గ్రామాల్లోని అనేకమంది మంది గిరిజన, గ్రామీణ ప్రజలు అత్యవసర వైద్య సేవలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గర్భిణులు, పాముకాటు బాధితులు, గుండెపోటు, ప్రమాద కేసుల్లో సకాలంలో ఆసుపత్రికి తరలించలేక ప్రాణాపాయ స్థితి నెలకొంది. ఈ సమస్య పరిష్కారం కోసం ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్, దానవాయిపేట వార్డు మెంబర్ కణితి రజిని, రుంజ రాజా తదితరులు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు , జిల్లా కలెక్టర్ , డి ఏం హచ్ ఓ కి వినతిపత్రం సమర్పించారు, మీడియా మిత్రులు కూడా ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన కలెక్టర్ ఈరోజు సత్యనారాయణపురం పీహెచ్ సీ కి 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. అంబులెన్స్ నంబర్: టీ జి 08 జి 4821. అంబులెన్స్ తిరిగి రావడంపై సత్యనారాయణపురం సర్పంచ్ చిక్కాల గౌతమి, కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. సహకరించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుకి, కలెక్టర్‌కి, మీడియా మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్, సత్యనారాయణపురం సర్పంచ్ చిక్కాల గౌతమి, కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్, వార్డ్



మెంబర్ కణితి రజిని, కణితి సోనీ, చరపా విజయ్ కుమార్, హెచ్ ఇ ఓ బాబురావు, ఎల్ టీ రామకృష్ణ, హాచ్ వి తిరుపతమ్మ, ఆన్ ఓ అనసూర్య, ఆన్ ఓ పద్మ, సిబ్బంది సత్యనారాయణ, దానవాయిపేట రుంజ రాజా, కారం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య విరాళాల చోరీ కేసులో ట్విస్ట్.. రంగంలోకి ఈడీ !

యూపీ/జూలై 2/(జన సంఘర్షణ)

అయోధ్య రామమందిరంకు సంబంధించి రూ.200కోట్ల మేరకు విలువైన నగదు, బంగారం, వెండి కానుకల విరాళాల చోరీ కేసులో యూపీ పోలీసులు మరో కీలక ట్వీస్టు ఇచ్చారు. ఈ కేసును దర్యాప్తు చేయాలంటూ పోలీసులు ఈడీకి లేఖ రాయడం ఆసక్తికరంగా మారింది. ఈ కుంభకోణంలో ఎస్‌బీఐ ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిపై దర్యాప్తు చేయాలంటూ ఈడీకి పోలీసులు లేఖ రాశారు. ఈ కేసులోకి ఎంట్రీ ఇచ్చిన ఈడీ భారీగా విరాళాల మాయంపై మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేయనుంది.

“విధాత: అయోధ్య రామమందిరంకు సంబంధించి రూ.200కోట్ల మేరకు విలువైన నగదు, బంగారం, వెండి కానుకల విరాళాల చోరీ కేసులో యూపీ పోలీసులు మరో కీలక ట్విస్ట్ ఇచ్చారు. ఈ కేసును దర్యాప్తు చేయాలంటూ పోలీసులు ఈడీకి లేఖ రాయడం ఆసక్తికరంగా మారింది. ఈ కుంభకోణంలో ఎస్‌బీఐ ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిపై దర్యాప్తు చేయాలంటూ ఈడీకి పోలీసులు లేఖ రాశారు. ఈ కేసులోకి ఎంట్రీ ఇచ్చిన ఈడీ భారీగా విరాళాల మాయంపై మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేయనుంది.



**సిట్ దర్యాప్తులో కీలక పురోగతి.....**

అయోధ్య రామమందిరం విరాళాల చోరీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ వేగవంతం చేసింది. అయోధ్య రామమందిరం విరాళాల చోరీ కేసును తవ్వేకొద్దీ అవకతవకలు బయటపడుతున్నాయి. తాజాగా కీలక నిందితుడు అవినాష్ శుక్లాను విచారిస్తున్న అధికారుల బృందం మరో కోణంలో అక్రమాలను గుర్తించింది. ఆలయంలో వివిధ పోస్టుల నియామకాలను డబ్బులు తీసుకొని చేశారని నిందితుడు వెల్లడించినట్లు పోలీసు వర్గాల సమాచారం. అతనిచ్చిన సమాచారం ఆధారంగా ఇప్పుడు ట్రస్ట్ సభ్యుల్లో కీలకమైన వారిని ప్రశ్నించే అవకాశం ఉంది. ఆలయంలో దాదాపు 125 మందిని వివిధ పోస్టుల్లో నియమించారు. వీరిలో కొందరి వద్ద నుంచి సొమ్ములు వసూలు చేసినట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందానికి ఆలయ ఉద్యోగులకు చెందిన అపాయింట్‌మెంట్ లెటర్లు, ఫార్మల్ సర్వీస్ అగ్రిమెంట్లు వంటివి అందకపోవడంతో అసలు వీరి నియామకం ఎలా జరిగింది..ఎవరి ఆదేశాల మేరకు జరిగాయన్నదానిపై విచారణ కొనసాగిస్తున్నారు. విరాళాల మాయం విచారణలో భాగంగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాలు, వారి లావాదేవీలపై అధికారులు విచారణ చేస్తున్నారు.

అయోధ్య ఆలయ విరాళాల చోరీ ఇంటిదొంగల పనే

**అయోధ్య విరాళాల చోరీ కేసులో ట్విస్ట్.. రంగంలోకి ఈడీ !**

అయోధ్య రామమందిరంకు సంబంధించి రూ.200కోట్ల మేరకు విలువైన నగదు, బంగారం, వెండి కానుకల విరాళాల చోరీ కేసులో యూపీ పోలీసులు మరో కీలక ట్వీస్టు ఇచ్చారు. ఈ కేసును దర్యాప్తు చేయాలంటూ పోలీసులు ఈడీకి లేఖ రాయడం ఆసక్తికరంగా మారింది. ఈ కుంభకోణంలో ఎస్‌బీఐ ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిపై దర్యాప్తు చేయాలంటూ ఈడీకి పోలీసులు లేఖ రాశారు. ఈ కేసులోకి ఎంట్రీ ఇచ్చిన ఈడీ భారీగా విరాళాల మాయంపై మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేయనుంది.

**సిట్ దర్యాప్తులో కీలక పురోగతి...**

అయోధ్య రామమందిరం విరాళాల చోరీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ వేగవంతం చేసింది. అయోధ్య రామమందిరం విరాళాల చోరీ కేసును తవ్వేకొద్దీ అవకతవకలు బయటపడుతున్నాయి. తాజాగా కీలక నిందితుడు అవినాష్ శుక్లాను విచారిస్తున్న అధికారుల బృందం మరో కోణంలో అక్రమాలను గుర్తించింది. ఆలయంలో వివిధ పోస్టుల నియామకాలను డబ్బులు తీసుకొని చేశారని నిందితుడు వెల్లడించినట్లు పోలీసు వర్గాల సమాచారం. అతనిచ్చిన సమాచారం ఆధారంగా ఇప్పుడు ట్రస్ట్ సభ్యుల్లో కీలకమైన వారిని ప్రశ్నించే అవకాశం ఉంది. ఆలయంలో దాదాపు 125 మందిని వివిధ పోస్టుల్లో నియమించారు. వీరిలో కొందరి వద్ద నుంచి సొమ్ములు వసూలు చేసినట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందానికి ఆలయ ఉద్యోగులకు చెందిన అపాయింట్‌మెంట్ లెటర్లు, ఫార్మల్ సర్వీస్ అగ్రిమెంట్లు వంటివి అందకపోవడంతో అసలు వీరి నియామకం ఎలా జరిగింది..ఎవరి ఆదేశాల మేరకు జరిగాయన్నదానిపై విచారణ కొనసాగిస్తున్నారు. విరాళాల మాయం విచారణలో భాగంగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాలు, వారి లావాదేవీలపై అధికారులు విచారణ చేస్తున్నారు.

**అయోధ్య ఆలయ విరాళాల చోరీ ఇంటిదొంగల పనే**

ఆయోధ్య విరాళాల మాయం కేసులో అరెస్టయిన అనుకల్ప్ మిశ్రా, లవ్ కుశ్ మిశ్రా, ఆలయ మేనేజర్ గోపాల్ రావుతో పాటు 10 మంది నిందితులు కూడా గతేడాది జనవరి, ఫిబ్రవరిలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళా సమయంలోనే అత్యధిక మొత్తంలో విరాళాలు దోచుకున్నట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. ఇప్పటికే వారి ఇళ్లల్లో జరిపిన సోదాల్లో పోలీసులు రూ.70.25 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. తాజాగా నిందితుల ఇళ్లపై మరోసారి అయోధ్య పోలీసులు దాడులు నిర్వహించారు. ప్రధాన నిందితులైన లవకుష్, అనుకల్ప్, కరుణేష్‌లు నివసించే మిల్కీపూర్, ఖండా, రుదౌలీ గ్రామాల్లో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో కొన్ని అత్యంత కీలకమైన పత్రాలతో పాటు ఒక రహస్య పెట్టెను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓ యోగా కేంద్రం నుంచి 'రామరాజ్య కోశ్' అనే పేరుతో ఉన్న విరాళాల హుండీని స్వాధీనం చేసుకున్నారు. దానిపై పేటీఎం క్యూఆర్ కోడ్ ఉంది. నిందితుల్లో ఒకరైన అవినాశ్ శుక్లా.. ఈ యోగా కేంద్రంలోని ఓ గదిలో గత పదేళ్లుగా నివాసం ఉంటున్నారని పోలీసులు తెలిపారు. కేసులో మరింత పురోగతి కోసం లవకుష్ తండ్రి బచ్చులాల్ మిశ్రాను అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రధాన నిందితుడి భార్య ఖాతాలో రూ.24లక్షల నగదు**

పోలీసుల దర్యాప్తులో ప్రధాన నిందితుడు లవకుష్ భార్య సుప్రియ బ్యాంక్ ఖాతాలో రూ. 24 లక్షల వరకు ఏడాదిలో లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఒక సాధారణ గృహిణి సుప్రియ ఖాతాలోకి ఇంత పెద్ద మొత్తంలో డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనేదానిపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ సొమ్ము విరాళాల చోరీకి సంబంధించినదా? లేక ఇంకా ఎవరైనా పెద్దల హస్తం ఉందా? అనే కోణంలో సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ అక్రమ లావాదేవీల వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుల ఐదేళ్ల బ్యాంకు ఖాతాలను రీఆడిట్ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ కేసులో మరిన్ని కీలక అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

**సిట్ దర్యాప్తుపై అసంతృప్తి**


మరోవైపు రామాలయ విరాళాల కుంభకోణంపై సిట్ దర్యాప్తు అంత సంతృప్తిగా లేదని అయోధ్య ఆలయ పూజారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఇప్పటికే నైతిక బాధ్యత వహిస్తూ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ సహా పలువురు ట్రస్ట్ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. కోట్లాది మంది నమ్మకాన్ని వమ్ము చేసిన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని త్వరగా, పారదర్శకంగా ముగించాలని కోరుతున్నారు. సిట్ దర్యాప్తు తీరుపై ఆధ్యాత్మిక ప్రవచనకర్త కర్పత్రి మహారాజ్ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు కావడానికి తామే కారణ మని ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు అజయ్ రాయ్ పేర్కొన్నారు. తమ పార్టీ ఒత్తిడి వల్లే ఈ చట్టపరమైన చర్య ప్రారంభమైందని అన్నారు. అయోధ్య రామ మందిర నిధుల దుర్వినియోగానికి సంబంధించి రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా, ఇతర సభ్యులు గోపాల్ రావు, చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని తాను డిమాండ్ చేశానని గుర్తు చేశారు. ఇకపోతే అయోధ్య విరాళాల మాయం కేసులో అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. అరెస్టయిన నిందితుల తరపున ఎవరూ వాదించకూడదని తీర్మానించింది. ఎవరైనా వాదిస్తే రూ.5 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించింది.

**బీజేపీది నకిలీ హిందుత్వ : అవిముక్తేశ్వరానంద**

అయోధ్య విరాళాల కుంభకోణం నేపథ్యంలో యుపీ ప్రభుత్వంపైనా, బీజేపీపైనా జ్యోతిర్మఠం పీఠాధిపతి అవిముక్తేశ్వరానంద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీలో ఉన్నవాళ్లు నకిలీ హిందువులని, వారిది నకిలీ హిందుత్వ అని ఆయన విరుచుకుపడ్డారు. వేదాలను, శాస్త్రాలను వాళ్లు నమ్మరని పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో అసలు దొంగలను వదిలేశారని, సిట్ అందుకే ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. 'ఈ కేసులో అసలు సూత్రధారులను వదిలేశారు. కింది స్థాయి ఉద్యోగుల పేర్లను మాత్రమే ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. రామ మందిరం విషయంలో మొదటి నుంచి ఏకపక్ష నిర్ణయాలే తీసుకుంటున్నారని ఆరోపించారు. రాజకీయ నాయకులు ఎంపిక చేసిన వ్యక్తులతో ట్రస్ట్ నడుస్తోందని, సాధువులు, జ్ఞానులు, పండితులను ఆలయ నిర్వహణలో దూరంగా పెట్టారని అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నిద్రలో ఉన్న భర్త చెవిలో విషం పోసిన భార్య..!

తమిళనాడు/జులై 2/(జన సంఘర్షణ)



తమిళనాడు: భర్తను చనిపోతే రుణదాతల ఒత్తిళ్ల నుంచి బైటపడవచ్చని భావించిన ఓ మహిళ కట్టుకున్న వాడినే లేపేసేందుకు స్కెచ్ వేసింది. అతడి చెవిలో విషం పోసింది.వివరాలు.. తంజావూరు జిల్లా, తిరువిడైమరుదూర్ తాలూకాలోని పుళుదికుడికి చెందిన కూలీ రవిచంద్రన్ (54), ఉమారాణి (48)ని 27 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి కుమారుడు విదేశాలలో పని చేస్తుండగా, కుమార్తెకు పెళ్లైంది. రవిచంద్రన్ కొత్తగా ఇంటి నిర్మాణం కోసం మీద పాలారి-డ్యామ్, ఇతర గ్రూపుల నుంచి రూ.10లక్షల రుణం పొందాడు. దీనిని చెల్లించలేకపోవడంతో తరచూ దంపతులు మధ్య గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో తన భర్త చనిపోతే రుణం తీర్చాల్సిన ఒత్తిడి ఉండదని భావించిన ఉమారాణి, తన తమ్ముడు జ్ఞానశేఖరన్ (35)తో కలిసి భర్తను చంపేందుకు స్కెచ్ వేసింది. మంగళవారం రాత్రి రవిచంద్రన్ నిద్రిస్తున్న సమయంలో అతడి చెవిలో వారిద్దరూ విషం పోశారు. మేల్కొన్న రవిచంద్రన్ వారి నుంచి తప్పించుకుని స్థానికుల సాయంతో కుంభకోణం ఆస్పత్రిలో చేరాడు.అతని ఫిర్యాదు ఆధారంగా, తిరువిడైమరదూర్ పోలీసులు కేసు నమోదు చేసి ఉమారాణి, జ్ఞానశేఖర్‌ను అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో మూడు నెలల క్రితమే ఆ ఇద్దరూ టీ లో విషం కలిపి అతన్ని చంపడానికి ప్రయత్నించారని, ఆ ఘటన నుంచి తప్పించుకున్న రవిచంద్రన్, అప్పటి నుంచి ఇంట్లో ఏమీ తినకుండా జాగ్రత్త పడుతున్నాడని తేలింది. ఈ క్రమంలో చెవిలో విషం పోసినట్లు నిర్ధారైణెంది. నిందితులిద్దరినీ కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్ నిమిత్తం తంజావూరు జైలుకు తరలించారు.

# ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా చెక్కుల అందజేత

- **బాన్సువాడ నియోజకవర్గంలో 43 మందికి రూ.12.86 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**
- **ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా చెక్కుల అందజేత**
- **బాన్సువాడ గ్రామీణ మండలంలో 6 మందికి రూ.2.03 లక్షలు రుద్రూర్ మండలంలో అత్యధికంగా 9 మందికి రూ.2.39 లక్షలు 10 మండలాల లబ్ధిదారులకు సహాయం అందజేత**

బాన్సువాడ/జూలై 2/(జన సంఘర్షణ)



బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసం వద్ద బాన్సువాడ నియోజక వర్గంలోని 43 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ.12,86,000 చెక్కులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజక వర్గ శాసన సభ్యుడు పోచారం శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజక వర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు ఎర్వలా కృష్ణారెడ్డి, మహ్మద్ ఏజాస్, అబ్దుల్ వాహబ్, చంద్రశేఖర్, దావూద్, వెంకటేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.


మండలాల వారీగా సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల వివరాలు:

బాన్సువాడ గ్రామీణ మండలం 6 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు 5.2,03,000, బాన్సువాడ మున్సిపాలిటీ ఇద్దరు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు 5.34,000, బీర్కూర్ మండలం ముగ్గురు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.1,12,000, నసురుల్లాబాద్ మండలం 5 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు 5.1,31,000, మోస్రా మండలం ముగ్గురు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.60,500, చందూర్ మండలం 5 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.1,25,500, వర్ని మండలం 4 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.1,81,000, రుద్రూర్ మండలం 9 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.2,39,500, కోటగిరి మండలం నలుగురు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.1,34,000, పోతంగల్ మండలం ఇద్దరు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.65,500, మొత్తం నియోజక వర్గంలో 43 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు 5.12,86,000 అందజేశారు.

# డీఎస్పీపై అక్రమాస్తుల కేసు.. ఏసీబీ సోదాల్లో భారీ ఆస్తుల వెలికితీత

- **ఏసీబీ సోదాల్లో భారీ ఆస్తుల వెలికితీత.. 15 చోట్ల తనిఖీలు**
- **డీఎస్పీపై అక్రమాస్తుల కేసు.. ఏసీబీ సోదాల్లో భారీ ఆస్తుల వెలికితీత**
- **ఏసీబీ సోదాల్లో భారీ ఆస్తుల వెలికితీత.. 15 చోట్ల తనిఖీలు**


హైదరాబాద్, గచ్చిబౌలి /జూలై 2/(జన సంఘర్షణ)



తెలంగాణ పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ (పీసీఎస్)లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా విధులు నిర్వహిస్తున్న సంకిరెడ్డి భీమ్ రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వెల్లడించింది. సేవా కాలంలో అక్రమ మార్గాల ద్వారా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో గురువారం ఆయన నివాసంతో పాటు బంధువులు, స్నేహితులు, బినామీలకు చెందిన 15 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల్లో హైదరాబాద్, గచ్చిబౌలి, టెలికాం నగర్, తెల్లాపూర్, నాగోల్, పటాన్‌చెరు, మణికొండ, వికార్షబాద్, సంగారెడ్డి, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో విల్లా, ఇండ్లు, ఫ్లాట్లు, వాణిజ్య భవనాల్లో వాటాలు, ఓపెన్ ప్లాట్లు, వ్యవసాయ భూములు గుర్తించారు. అలాగే రూ.3.60 లక్షల నగదు, బినామీ నివాసంలో మరో రూ.40 లక్షల నగదు, సుమారు 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులు, రూ.19.91 లక్షల బ్యాంకు నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా 23 విదేశీ మద్యం సీసాలు కూడా గుర్తించడంతో సంబంధిత చర్యల కోసం ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఏసీబీ తెలిపింది. ఆస్తుల మార్కెట్ విలువ పత్రాల విలువ కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అదనపు ఆస్తులపై విచారణ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
03 జూలై 2026

## భయపడిన దొంగ.. చెత్తబుట్టలో ప్రత్యక్షమైన రిజిస్టర్!




నిజామాబాద్/జూలై 2/(జన సంఘర్షణ)
నిజామాబాద్: బోధన్ స్థానిక జీహెచ్ఎస్(జేసీ) పాఠశాలలో గత 45 రోజులుగా అదృశ్యమైన అడ్మిషన్ రిజిస్టర్ ఎట్టకేలకు గురువారం స్కూల్ ప్రాంగణంలోని మిడ్ డే మీల్స్ భవనం మెట్ల కింద ఉన్న చెత్తబుట్టలో లభ్యమైంది. మే 12న డీఈవో ఆఫీస్ నుండి తిరిగి స్కూల్ కు తెచ్చిన తర్వాత ఈ రిజిస్టర్ మాయమైంది. అయితే, ఈ వ్యవహారంపై వార్తా కథనాలు రావడంతో భయపడిన దొంగే.. గుట్టుచప్పుడు కాకుండా ఆ రిజిస్టర్‌ను చెత్తబుట్టలో పడేసి వెళ్లిపోయి ఉంటాడని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా రిజిస్టర్ తిరిగి దొరకడంతో పాఠశాలలో నెలకొన్న గందరగోళానికి ప్రస్తుతానికి తెరపడింది.

## ప్రభుత్వ పాఠశాలలను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించాలి

- బీడీఎస్ఎఫ్ డిమాండ్.
- మూసివేత నిర్ణయం వెనక్కి తీసుకోవాలని వినతి.




బోధన్/జూలై 2/(జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించాలని బహుజన్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీడీఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం బోధన్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సంజయ్ తల్లారే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు సమస్యల కేంద్రాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పలు బడుల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరుగుదొడ్లు, మూత్రశాలల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. మధుమలాంచ పాఠశాల వద్ద రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, బీర్ సీసాలు వంటి వ్యర్థాలు కనిపిస్తున్నాయని ఆరోపించారు. వెంటనే ప్రహరీ గోడ నిర్మించి పాఠశాలకు భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయింపు పకడ్బందీగా అమలు చేయాలని బీడీఎస్ఎఫ్ కోరింది.

## పశువుల వైద్యుడు కావాలని గ్రామస్థుల వినతి



పోతంగల్/జూలై 2/(జన సంఘర్షణ)
పశువుల వైద్యుడిని వెంటనే నియమించాలని పోతంగల్ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నాయబ్ తహశీల్దార్ హాజీజ్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థుడు బజరంగ్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో పశువులకు సీజన్ వ్యాధులు, మేకలకు, గొర్రెలకు, గేదెలకు దూడలకు, వచ్చే అవకాశం ఉందని.. వెంటనే వైద్యుడిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, గంధపు హన్మాండ్లు, ఓమన్ పటేల్, కిరణ్ సేట్, సూదం సాయిలు, శంకర్, యామ గంగారం, అశోక్ తదితరులు ఉన్నారు.

## తిర్మలాపూర్ గ్రామంలో సర్



పోతంగల్/జూలై 2/(జన సంఘర్షణ)
పోతంగల్ మండల కేంద్రంలో తిరుమలపురం గ్రామంలో ప్రక్రియ ఎన్యూమరేషన్ ఫారం నిమ్మపుటకు ఓటర్లలకు ఇబ్బదులున్నదునా సహాయం అందిచాగలరని రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటీజాన్స్, అందరూ తమబాధ్యతగా సహకరిం చగలరని/ సహకరిస్తారని తమరిని సేవినయంగా కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో తిరుమలపూర్ సర్పంచ్, ఎమ్మార్వో, సందీప్, రెవిన్యూ సిబ్బంది, ఆశ వర్కర్స్, గ్రామస్తులు జై రామ్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు విక్రయించడం దారుణం



చందూరు/జూలై 2/(జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లా చందూరు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పాఠశాలకు సంబంధించిన బుక్స్ అమ్మడం చాలా దారుణమని ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా చందూరు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులు వెళ్లి పాఠ్యపుస్తకాలను విక్రయించడం, పాఠ్యపుస్తకాలు ఓ గదిలో ఉంచడం, గుర్తించినట్టు వారు తెలిపారు. ఈ విషయం ఎంఈఓ కు సమాచారం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..పాఠశాలలో పాఠ్యపుస్తకాలు విక్రయించడం ఎంతవరకు సమంజసమని ఈ వ్యవహారాన్ని వెంటనే ఆపాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు పేర్కొన్నారు. మంగళవారం నాడు ఏబీవీపీ సంఘం నాయకులు ఓ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి ఓ గదిలో పాఠ్య పుస్తకాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించినట్టు, ఈ విషయం ఎంఈఓ కి సమాచారం తెలపడంతో ఎంఈఓ ఇతర ప్రదేశాలలో ఉండడం, దీంతో సిఆర్పిని పంపించడం ఆ గదికి తాళం వేసి ఉంచడం, జరిగిందని పేర్కొన్నారు, బుధవారం ఉదయం ఎంఈఓ విద్యార్థి సంఘ నాయకులు వెళ్లి గదిలో పరిశీలించగా బుక్స్‌లు ఉన్నాయని గుర్తించినట్టు తెలిపారు, బుక్స్ ఉంచి విక్రయించడం చాలా దారుణమని విద్యార్థి సంఘ నాయకులు వీటిపై చర్యలు తీసుకోవాలని తెలిపినట్టు వారు పేర్కొన్నారు. పాఠశాల చైర్మన్ స్కూల్లో లేరని ఊరికి వెళ్లారని తాళం చేయి లేదు అని చెప్పిన సిబ్బంది, అనంతరం తాళం చెయ్యి తేవడం గది తలుపులు తెరవడం, విచిత్రంగా ఉందని విద్యార్థి సంఘ నాయకులు పేర్కొన్నారు. తాళం చెవి లేదు చైర్మన్ వద్ద ఉందని చెప్పిన సిబ్బంది, అధికారులకు సమాచారం ఇవ్వడం అధికారులు వచ్చిన వెంటనే తాళం చేయి తెచ్చి తాళం తీయడం, మ్యాజిక్ చందంగా ఉందని ఒకేసారి తాళం చెయ్యి ఎక్కడి నుంచి వచ్చిందని, విద్యార్థి సంఘ నాయకులు మండిపడ్డారు. పిల్లలకు మహిళా ఉపాధ్యాయులకు డిస్టర్బ్ చేయడం అదేవిధంగా లోపలికి చొరవడి దాడులకు ప్రయత్నాలు చేయడం దారుణం. మంగళవారం విద్యార్థి సంఘ నాయకులు అంటూ పాఠశాలలో తమ చైర్మన్ లేని సమయంలో మహిళా ఉపాధ్యాయులు ఉండగా పిల్లలు ఉండగా పాఠశాల లోకి చొరబడి దాడులకు దిగడం సరికాదని దీనివల్ల పిల్లలు మహిళ ఉపాధ్యాయులు భయాందోళనకు గురి కావడం జరిగిందని మహిళా ఉపాధ్యాయులతో పాటు అక్కడున్న కొంతమంది





సిబ్బంది ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం, బుధవారం ఎంఈఓ వచ్చి పాఠశాల సిబ్బందితోపాటు విద్యార్థి సంఘ నాయకులకు కూర్చోబెట్టి విచారణ చేపట్టారు, ఈ సందర్భంగా పాఠశాలను మహిళా ఉపాధ్యాయులు ఒకేసారి పాఠశాల లోకి చొరవడం పట్ల తమకు భయం వేసిందని ,పిల్లలు కూడా భయపడడం జరిగిందని , పాఠశాల చైర్మన్ సారు లేని సమయంలో పాఠశాలకు చొరవడం ఎంతవరకు సమంజసం అని వారు ఎంఓ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని సమాచారం. 40 మంది పేద పిల్లలకు బుక్స్ ఇవ్వడం కోసం ఉంచడం జరిగింది. పాఠశాలలో ప్రభుత్వ జీవో ప్రకారం 20% పేద పిల్లలకు చదివించాలని ఉద్దేశంతో సదురు పాఠశాల నిర్వాహకులు 40 మంది పేద పిల్లలు ఉచితంగా విద్య బోధన చేస్తున్నందుకు వారికి పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇవ్వడం కోసం గదిలో బుక్స్ ఉంచడం జరిగిందని నిర్వాహకులు తమ దృష్టికి తేవడం జరిగిందని ఎంఈఓ అన్నారు. ఇరు వర్గాల వాదనలు వినడం జరిగిందని, అయినప్పటికీ పాఠశాల నిర్వాహకులకు నోటీసు ఇవ్వడం జరిగిందని తగిన వివరణ ఇవ్వాలని తెలపడం జరిగిందని ఎంఈఓ పేర్కొన్నారు. ఏది ఏమైనా చందూరు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థి సంఘ నాయకులు చేసిన హల్చల్ కార్యక్రమం చందూరు మండల కేంద్రంలో హాట్ టాపిక్ గా మారింది, ప్రధానంగా ప్రైవేటు పాఠశాలలో అధిక రేట్లకు విక్రయాలు చేయడం, పుస్తకాల వ్యాపారం స్వయంగా చేయడం సమంజసం కాదని ఇలాంటివి జరుగుతున్నాయని విద్యార్థి సంఘ నాయకులు చెప్పుకొని రావడం విశేషం, దీనిపై విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది సస్పెన్స్ గా మారింది.

## విద్యా సంస్థలపై దాడులు, బందులకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవు

- సీపీ సాయి చైతన్య.
- అనుమతి లేకుండా స్కూళ్లు, కాలేజీల్లోకి విద్యార్థి సంఘాలు ప్రవేశించవద్దు
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు
- సమస్యలు ఉంటే జిల్లా, విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచన

నిజామాబాద్/జూలై 2/(జన సంఘర్షణ)
విద్యాసంస్థలపై దాడులు చేయడం, యాజమాన్యాన్ని బెదిరించడం, విద్యాసంస్థల బంద్‌లకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్. హెచ్చరించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో కొన్ని విద్యార్థి సంఘాల పేరుతో వ్యక్తులు పాఠశాలలు, కళాశాలల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించి అలజడి సృష్టించడం, యాజమాన్యాలను బెదిరించడం, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం వంటి ఘటనలపై విద్యాసంస్థల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశపూర్, బర్దిపూర్ శివారులో ఉన్న నారాయణ విద్యాసంస్థలో అక్రమంగా ప్రవేశించి కుర్చీలు, ఫ్లెక్సీలు తదితర వస్తువులను ధ్వంసం చేసిన వారిపై ఇప్పటికే క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని చందూరు మండలంలోని శ్రీ సాయి విద్యాలయం స్కూల్‌లో యాజమాన్య అనుమతి లేకుండా ప్రవేశించి సిబ్బందిని బెదిరించడం, విద్యార్థులను భయాందోళనకు గురిచేయడం, పాఠశాల ఆస్తులను ధ్వంసం చేసిన వారిపైనా క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ రెండు కేసుల్లో నిందితులపై గతంలో నమోదైన కేసులు ఉన్నట్లయితే వాటిని పరిగణనలోకి తీసుకుని అదనపు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. విద్యాసంస్థలకు సంబంధించిన సమస్యలు ఉంటే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా సంబంధిత జిల్లా అధికారులు లేదా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అధికారులు నిబంధనల ప్రకారం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగించే విధంగా విద్యాసంస్థల్లో ఇబ్బందికర వాతావరణం సృష్టించడం, నిర్వాహకుల విధులకు ఆటంకం కలిగించడం, బలవంతంగా బంద్ చేయించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలు, కళాశాలలను ఎవరూ బలవంతంగా బంద్ చేయించరాదని, అలాంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య స్పష్టం చేశారు.







# ఒక ఓటు మహిమ ఎంతో తెలుసా.....!

- బోధన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య ను ప్రకటించిన హైకోర్టు

బోధన్/జులై 2/(జన సంఘర్షణ
నిజామాబాద్ జిల్లా బోధన్ బార్ అసోసియేషన్ కు ఈ మార్చి లో 2026–27 వార్షిక ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శి పదవికి సమ్మయ్యవాజీద్ హుస్సేన్ ఇద్దరు పోటీ చేశారు. ఓట్ల లెక్కింపులో ఇద్దరికి 53 చొప్పున సమాన ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి ప్రకటించారు. ఒకి ఓటు చెల్లుబాటు కాలేదని ధ్రువీకరించారు. ఇద్దరికి సమాన ఓట్లు వచ్చినందున ఇద్దరు చెరి ఆరు నెలల చొప్పున పదవి చేపట్టాలని ధ్రువపత్రం జారీ చేశారు. దీనిని సవాలు చేస్తూ న్యాయవాది సమ్మయ్య తెలంగాణ తెలంగాణ హైకోర్టు లో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. రిట్ పిటిషన్ విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి జస్టిస్ తుకరాంజీ ఎన్నికల అధికారి, డిస్ట్రిక్ట్ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, వాజీద్ హుస్సేన్ కు నోటీసులు జారీ చేసి వారి వివరణ తీసు తీసుకున్నది. ఒకే ఓటులో సమ్మయ్య పేరుకు ఎదురుగా టిక్ గుర్తుకు బదులు స్వస్తిక్ గుర్తు పెట్టినందున ఓటు చెల్లదని ఎన్నికల అధికారి ప్రకటించడం చట్ట విరుద్ధమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఆ ఒక్క ఓటు సమ్మయ్యకే పడ్డట్టుగా తేల్చింది. ఒక ఓటు ఎక్కువగా వచ్చినందున సమ్మయ్య బార్ ప్రధాన కార ఎన్నికైనట్లు ప్రకటించింది. ఇద్దరికి ఆరు నెలల చొప్పున పదవి కాలం ఎన్నికల అధికారి ప్రకటించడం బార్ బై లా లో లేదని జస్టిస్ తుకరాంజీ తెలిపారు.



Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co